ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY 3 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శనివారం 31 మే 2025

గ్రేడ్లుగా పంచాయతీలు

- క్లస్టర్ విధానానికి స్వస్తి
- జిల్లాలో567 పంచాయతీలు
- నివేదికలు పంపిన అధికారులు



ముదిగుబ్బ మండలం పొడరాళ్లపల్లి పంచాయతీ వ్యూ

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో క్లస్టర్ విధానానికి స్వస్తి పలికి గ్రేడ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో ఒక క్లస్టర్‌లో రెండు లేదా మూడు పంచాయతీలు ఉండేవి. తాజాగా జనాభా, వార్షిక ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని పంచాయతీలను గ్రేడ్లుగా విభజించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లాలో 32 మండలాల్లో 567 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ప్రత్యేక గ్రేడ్‌లో 13, గ్రేడ్-1గా 79 పంచాయతీలు, గ్రేడ్-2లో 55, గ్రేడ్-3గా 170 పంచాయతీలను విభజించారు. ప్రస్తుతం క్లస్టర్‌లో మేజర్, మైనర్ పంచాయతీల వ్యవస్థ నడుస్తోంది. రెండు లేదా మూడు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక కార్యదర్శిని నియమించి పాలన సాగిస్తున్న పరిస్థితి ఉంది. ఇకపై జనాభా, ఆదాయం ఆధారంగా పంచాయతీలకు గ్రేడ్‌లు ఇవ్వనున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఆదర్శ పంచాయతీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గ్రేడ్ విధానంలో సచివాలయ సిబ్బందిని అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేయనున్నారు. ఇందు కోసం గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు కసరత్తు ప్రారంభించారు.

విభజన ఇలా...

- పది వేల జనాభా లేదా ప్రభుత్వ గ్రాంట్లు కాకుండా కోటి రూపాయల ఆదాయం వచ్చే పంచాయతీలను ప్రత్యేక గ్రేడ్‌గా చేయనున్నారు. వీటికి ఈఓపీఆర్‌డీలను అధికారులుగా నియమిస్తారు. వీరినే డిప్యూటీ ఎంపీడీఓలుగా పిలవనున్నారు. వీటి పరిధిలోకి మేజర్ పంచాయతీలను తీసుకురానున్నారు.
- నాలుగు వేల నుంచి పది వేల మధ్య జనాభా లేదా రూ.50లక్షల నుంచి కోటి రూపాయల ఆదాయం ఉండే పంచాయతీలను గ్రేడ్-1గా ఎంపిక చేయనున్నారు. మండల కేంద్రాలుగా ఉండే పంచాయతీలను వీటి పరిధిలోకి తీసుకురానున్నారు.
- రెండు వేల నుంచి నాలుగువేల మధ్య జనాభా గల పంచాయతీలను గ్రేడ్-2గా పరిగణిస్తారు.
- రెండు వేల కన్నా తక్కువ జనాభా ఉండే పంచాయతీలను గ్రేడ్-3 పరిధిలోకి తీసుకురానున్నారు.

జిల్లాలో అత్యధికంగా గిరిజన పంచాయతీలు ఉండటంతో ఇవన్నీ గ్రేడ్-3 లోకి వెళ్లే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ పంచాయతీల్లో రెండు వేల కన్నా తక్కువ జనాభా ఉన్నారు.

నివేదికలు పంపాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీలను మూడు గ్రేడ్‌లుగా విభజించాం. ఆ నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. తరువాత పంచాయతీలకు గ్రేడ్లు ప్రకటిస్తాం.

- సమత, జిల్లా పంచాయతీ అధికారి

ఎనిమిది ఎకరాలు తీసుకున్నారు



జిల్లేడుబండ రిజర్వాయర్‌కు మా భూమి 8 ఎకరాలు తీసుకున్నారు. వేరుశనగ, టమోటా, పూలమొక్కలు, ఇతర పంటలు సాగు చేసేవాళ్లం. వైసీపీ ప్రభుత్వంలో జిల్లేడుబండ ముంపు రైతులకు పరిహారం అందించకుండా డ్యామ్ పనులు మొదలు పెట్టారు. నా పొలం వద్దే కరకట్టకు సర్వే చేశారు. పంటలు సాగు చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నాం.

- గుర్రం చంద్ర, రైతు, పొడరాళ్లపల్లి



పనులు నిలిపివేయడంతో పెరిగిన జిల్లేడు మొక్కలు

- జిల్లేడుబండ ప్రాజెక్టుకు 2,700 ఎకరాల సేకరణ
- రైతులకు పైసా కూడా చెల్లించని ప్రభుత్వం
- బిల్లులు రాక పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పరిహారం అందేనా?

జిల్లేడుబండే..?

ముదిగుబ్బ, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు పనులు ప్రారంభమై సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం ప్రకటించడంలేదు. దీంతో జీవనాధారమైన భూములు కోల్పోయి, పరిహారం అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులను ఐదేళ్ల కిందట ప్రారంభించారు. ఇందుకోసం ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల్లో రైతుల నుంచి 2500 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 700 ఎకరాలు జలాశయానికి కేటాయించగా మిగిలిన 1800 ఎకరాలు ముంపు కింద కోల్పోతున్నారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం బాధితులకు ఎటువంటి పరిహారం ప్రకటించలేదు.

అర టీఎంసీ నుంచి 2.41కి పెంపు

ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లి తండా గ్రామ సమీపాన అర టీఎంసీ సామర్థ్యంతో జిల్లేడుబండ రిజర్వాయర్‌కు 2005-06లో శంకుస్థాపన చేశారు. ఇందు కోసం దాదాపు 300 ఎకరాలు అవసరమని భూ సర్వే నిర్వహించారు. ఆ తర్వాత ఎలాంటి పనులు ముందుకు సాగలేదు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు సామర్థ్యాన్ని 2.41 టీఎంసీలకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 2700 ఎకరాలు భూమి సేకరించారు. ఈనేపథ్యంలో ప్రాజెక్టు పనుల కోసం 2020 సెప్టెంబరు 22న ప్రభుత్వం రూ.680 కోట్ల నిధులు జారీ చేసింది. ఈ రిజర్వాయర్‌కు హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తరలించనున్నారు. ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పలు మండలాలకు సాగునీరు అందించాలని

(మిగతా 4వ పేజీలో...)

---

43 పోస్టులకు 1804 దరఖాస్తులు

- వైద్యవిధాన పరిషత్‌లో పోస్టులకు పోటాపోటీ
- మొదలైన పైరవీలు.. రంగంలోకి దళారీలు

4

రేపు మహిళల హాకీ జట్టు ఎంపిక

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఆదివారం జిల్లా జూనియర్ మహిళల హాకీ జట్టును ఎంపిక చేస్తామని హాకీ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బంధనాధం సూర్యప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జట్టు భీమవరంలో జూన్ 6 నుంచి 8వతేదీ వరకు జరిగే 15వ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. అక్కడ ప్రతిభ కనబరచిన క్రీడాకారిణులను ఆగస్టు 1 నుంచి 11వ తేదీ వరకు కాకినాడలో జరిగే 15వ జాతీయస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారని వివరించారు.

అపూర్వ సహోదరులు..!

- విగ్రహాల తయారీలో రాణిస్తున్న అన్నదమ్ములు
- అగళి కళాకారుల నైపుణ్యానికి పలువురి ప్రశంసలు (4లో)



మూసేసుకున్నారు..!

హైవేలపై వంతెనల మూత

వర్షపు నీరు వెళ్లకుండా అడ్డంకులు

పట్టించుకోని అధికారులు

- ఇక్కడ కనిపిస్తున్న చిత్రం అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోనిది. అనంతపురం - కళ్యాణదుర్గం ప్రధాన హైవే. రోడ్డు నిర్మాణ క్రమంలో స్థానికంగా చిన్నపాటి వంతెన ఏర్పాటు చేశారు. వర్షాలు కురిసిన సమయంలో.. చుట్టుపక్కల ఉన్న పొలాల్లోని నీరు, రోడ్డుపై పడిన వర్షపు నీరు వంతెనా గుండా వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. స్థానికంగా హైవేకు పక్కనే కురుగుంట గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు టీ కేఫ్ ఏర్పాటు చేశాడు. అందులో భాగంగా హైవేకు సంబంధించిన వంతెనను ఓ వైపు పూర్తిగా మూసేశాడు. ఇది జరిగి కూడా ఏడాది కావస్తోంది.

అనంతపురంరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులకు అనుబంధంగా ఏర్పాటు చేసిన వంతెనలను ప్రైవేటు వ్యక్తులు మూసేస్తున్నా.. సంబంధిత అధికారులు కళ్లు మూసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారుల్లో నీటి ప్రవాహాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడికక్కడ చిన్న..పెద్ద తరహా వంతెనలను ఏర్పాటు చేశారు. ఈ వంతెనలను కొంత మంది స్వార్థపరులు తమ వ్యాపార సముదాల కోసం మూసేస్తున్నారు. తద్వారా నీటి ప్రవాహాలకు అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇందుకు పై ఉదాహరణలే నిదర్శం. ఇంత జరుగుతున్నా సంబంధింత అధికారులు అటువైపు (మిగతా 4లో...)

నగదు.. బంగారం చోరీ

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతానగర్‌లో పోలేపల్లి కోనశేఖర్ గుప్త అనే వ్యాపారి ఇంట్లో గురువారం రాత్రి దొంగలు పడ్డారని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. కుటుంబ సభ్యులు ఓ గదిలో నిద్రిస్తుండగా, మరో గది కిటికీని తొలగించి దొంగలు లోపలికి ప్రవేశించారని తెలిపారు. ఇంట్లో ఉన్న రూ.2.80 లక్షల నగదు, 5.8 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

రేషన్ పంపిణీలో సమూల మార్పులు

రేపటి నుంచి షాపుల వద్దే పంపిణీ

15 రోజులు దుకాణాల నిర్వహణ

ఒంటరి వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లవద్దకే..

పుట్టపర్తి టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): నిత్యవసరాల పంపిణీలో ప్రభుత్వం కీలకమార్పులు చేసింది. జూన్ 1నుంచి రేషన్ షాపుల వద్దనే పంపిణీ చేయనున్నారు. వైసీపీ పాలనలో రేషన్ లబ్ధిదారులకు ఇళ్లవద్దకే పంపిణీ అంటూ వాహనాలు ఏర్పాటు చేశారు. ఆర్భాటంగా చేసిన ఈ ప్రయత్నం క్షేత్రస్థాయిలో అభాసుపాలయింది. దీంతో ప్రస్తుత ప్రభుత్వం వాహనాలకు స్వస్తి చెప్పి, షాపుల ద్వారా పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 5,71,889 రేషన్‌కార్డులకు గాను.. 16,89,531 మంది లబ్ధిదారులు ఉన్నారు. 1367 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతినెలా 8,600 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. 12 స్టాక్ పాయింట్ల ద్వారా ఆయా మండలాల్లోని రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇక నుంచి ప్రతినెలా 1నుంచి 15వ తేదీ వరకు షాపులు తెరచే ఉంటాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలి. 65 సంవత్సరాలు పైబడిన ఒంటరి వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లవద్దే నిత్యవసరాలు పంపిణీ చేస్తారు. ఈ మేరకు డీలర్లకు వారి పరిధిలోని వృద్ధులు, దివ్యాంగుల జాబితాను అందించారు. ఈపోస్ మిషన్ తీసుకెళ్లి వారి ఇళ్లవద్దే వేలిముద్రలు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.

పటిష్టంగా పంపిణీ



నూతన ప్రజా పంపిణీ విధానం ప్రకారం జిల్లాలో నిత్యవసరాలను పంపిణీ చేస్తాం. జిల్లాలోని స్టాక్ పాయింట్ల నుంచి ఇప్పటికే రేషన్ షాపులకు బియ్యం, నిత్యవసర వస్తువులు చేరవేశాం. ఒంటరి వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లవద్దకెళ్లి సరుకులు అందించేలా ఏర్పాటు చేశాం. పొరపాట్లకు తావులేకుండా పటిష్ఠంగా సరుకులు పంపిణీ చేస్తాం.

- వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ

ఆర్డీటీపై ఆంక్షలు తొలగించాలి

ప్రధానికి రఘువీరా లేఖ



మడకశిర, మే 30(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ పై ఆంక్షలు తొలగించాలని ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు లేఖ రాశానని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి తెలిపారు. నీలంకరాపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో 4.50 లక్షలకు పైగా కుటుంబాలకు విద్య, వైద్యం, వ్యవసాయం సహా అనేక సాయాలు అందుతున్నాయని అన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు అందకుండా విధించిన ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం తొలిగించాలని కోరారు. 1970లో ఎఫ్‌సీఆర్‌ఏలో నమోదైన ఆర్డీటీ, దశాబ్దాలుగా మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా నిస్వార్థ సేవలు అందిస్తోందని అన్నారు. ఆర్డీటీ విదేశీ నిధుల పైనే ఎక్కువగా ఆధారపడుతోందని, ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ నిలిపివేయడంతో ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లాపై ప్రభావం పడుతోందని అన్నారు. జిల్లాలో పేదల నుంచి సంపన్నుల వరకు ఆర్డీటీ సేవలు పొందని కుటుంబాలు లేవంటే అతిశయోక్తి కాదని, అలాంటి సంస్థ గురించి కేంద్రానికి నివేదించి, సేవలను పునరుద్ధరించాల్సిన బాధ్యత జిల్లా ప్రజాప్రతినిధులు, రాష్ట ప్రభుత్వంపై ఉందని అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో

తీవ్ర జాప్యం

- పెద్ద సంఖ్యలో దెబ్బతింటున్న వైనం
- నత్తనడకన రిపేర్లు
- రైతులు, వినియోగదారులకు తప్పని నిరీక్షణ



బళ్లారి రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రం

కాలిపోతే.. కష్టాలే..!

మరమ్మతులకు లోనైన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు

నెల	పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య
జనవరి	223
ఫిబ్రవరి	290
మార్చి	308
ఏప్రిల్	279
మే (ఇప్పటి వరకు)	873



అనంతపురం రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందంటే అంతే సంగతులు. ఎన్నాళ్లకు ఏర్పాటు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ట్రాన్స్‌ఫార్మర్ రీప్లేస్‌మెంట్ కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురు చూడటమే రైతులు, వినియోగదారుల వంతవుతోంది. మరమ్మతు కేంద్రాల్లో ఆశించిన స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు పూర్తి కాకపోవడం ఇందుకు కారణం. రోజుకు పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతుంటే.. రిపేరవుతున్న వాటిని వేళ్లమీద లెక్కబెట్టవచ్చు. గత ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా 2 వేల వరకు మరమ్మతులకు గురైన వాటి లెక్కలను పరిశీలిస్తే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎన్నెన్నో కారణాలు

వేసవిలో లోఓల్టేజీ, హైఓల్టేజీ కారణాలతో ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోతున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులకు దెబ్బతింటున్నాయి. పదిరోజుల క్రితం కురిసిన వర్షాలకు రాప్తాడు మండలంలో మాత్రమే 20 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నట్లు సంబంధిత అధికారుల లెక్కలు చెబుతున్నాయి. శింగనమల, అనంతపురం రూరల్, విడపనకల్లు ప్రాంతాల్లో ఇదేస్థాయిలో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లను వినియోగిస్తుండటం కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. వాస్తవానికి ట్రాన్స్‌ఫార్మర్ కాలపరిమితి 25 ఏళ్లు అని సంబంధిత అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో గడువు తీరిపోయిన వాటిని వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తరచూ మరమ్మతులకు వస్తున్నాయన్న వాదనలు సంబంధిత వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

భారీగా మరమ్మతుల బారిన..

జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో

(మిగతా 4వ పేజీలో)



భక్తి యాత్ర

మొక్కుబడి తీర్చుకునేందుకు ఓ భక్తుడు అయోధ్య నుంచి రుషికేష్‌కు కాలినడకన వెళుతున్నారు. జాతీయ జెండా, కావడితో వడివడిగా వెళుతున్న అయోధ్యకు చెందిన రోహిత్.. కియ సమీపంలో శుక్రవారం ఆంధ్రజ్యోతి కంటబడ్డారు. రామేశ్వరంలో పవిత్ర జలాలను తీసుకుని రిషికేష్‌లో కలుపుతానని తాను మొక్కుకున్నానని, అందుకే తన స్వస్థలం అయోధ్య నుంచి కాలినడక వెళుతున్నానని తెలిపారు. పాదయాత్ర 130 రోజుల్లో పూర్తి చేస్తానని, తొలుత రామేశ్వరం వెళ్లి.. అక్కడ పవిత్ర జలాలను తీసుకుని రిషికేష్‌కు వెళ్లి కలుపుతానని తెలిపారు. అయోధ్య నుంచి బయలుదేరి 65 రోజులైందని, మరో 65 రోజుల్లో రుషికేష్‌కు చేరుకుంటానని తెలిపారు. రోజుకు 50 నుంచి 60 కి.మీ. ప్రయాణిస్తున్నానని తెలిపారు

- ఆంధ్రజ్యోతి, హిందూపురం



కొట్టు, ఆ పక్కనే చిన్న గది కనిపిస్తున్నాయి. వాటి వెనకాలే కనీ కనిపించకుండా ఓ నిర్మాణం ఉంది. అదే.. బస్సు షెల్టర్. ఆర్టీసీ అర్థంలేని చర్యలకు ఇది నిదర్శనం. ప్రయాణికులకు అనువుగాని చోట బస్సు షెల్టర్ నిర్మించారు. అందులోకి ఎవరూ వెళ్లట్లేదు. ఇక.. అడిగేవారు లేరన్న ధీమాతో బస్సు షెల్టర్ కనిపించకుండా ఏకంగా ముందుకు కొట్టు, గది కట్టేసుకున్నారు. కొంతదూరంలో ప్రయాణికులు ఎండలో ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.



అదిగదిగో.. సందులో దూరంగా సగం పూర్తయిన భవనం చూశారా.. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా అది బస్సు షెల్టరే. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు క్రాస్‌లో నిర్మాణం చేపట్టారు. షెల్టర్ ముందు దేవాలయం, గుడిసె ఉంది. అనువుగాని చోట బస్సు షెల్టర్ నిర్మించడంతో ప్రయాణికులు అక్కడికి వెళ్లలేక చెట్టు నీడనే బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు.



కట్టెలు, పాత బంకును చూసి కట్టెల డిపో అనుకుంటే పొరబడినట్లే. ఇది బస్సు షెల్టర్. బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్ క్రాస్‌లో దాతల సాయంతో దీనిని నిర్మించారు. ఉపయోగంలో లేకపోవడంతో అక్కడ కట్టెలు వేశారు. ప్రయాణికులు దుకాణాలు, హోటళ్ల ముందు వేచిఉంటూ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.

ఉన్నా.. లేనట్లే..!

అనువుగాని చోట బస్సు షెల్టర్ల నిర్మాణం

బస్సులు ఆగేదొక చోట.. షెల్టర్ మరోచోట..

ఎండ, వర్షంలో ప్రయాణికుల తిప్పలు

బొమ్మనహాళ్, మే 30(ఆంధ్రజ్యోతి): అధికారుల అనాలోచితంగా, అనువుగానిచోట బస్సు షెల్టర్లు నిర్మించడంతో ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. బస్సులు ఆగేదొకచోట.. షెల్టర్ మరోచోట ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండయినా.. వర్షం వచ్చినా.. అక్కడే అవస్థలు పడుతూ నిరీక్షిస్తున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల మీదుగా కళ్యాణదుర్గం-బళ్లారి అంతర్రాష్ట్ర రహదారి వెళ్తుంది. రహదారి పక్కన ఉండే గ్రామాల్లో బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని ఉంతకల్లు క్రాస్, ఉద్దేహాళ్, ఉప్పరహాళ్ క్రాస్ గ్రామాల్లోని బస్సు షెల్టర్లను అనువుగాని చోట్ల నిర్మించారు. అక్కడికి దూరంలో బస్సుల కోసం ప్రయాణికులు ఎండకి ఎండుతూ.. వర్షంలో తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారుల తీరుతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఛీ.. ఛీ..!



పామిడి బస్టాండుకు కాంపౌండు లేక పేరుకు పోయిన చెత్త

- అధ్వానంగా బస్టాండ్లు
- కనీస సౌకర్యాలు కరువు
- పెచ్చులూడుతున్న పైకప్పులు
- మరుగుదొడ్లలో నీరు కూడా ఉంచని దుస్థితి
- తాండవిస్తున్న అపరిశుభ్రత
- ఏమాత్రం పట్టించుకోని యాజమాన్యం



గుంతకల్లు బస్టాండులో పనిచేయని తాగునీటి ట్యాంక్

గుంతకల్లు నెట్‌వర్క్, మే 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్లు అధ్వానంగా ఉంటున్నాయి. కనీస పరిశుభ్రత లేకుండా.. ఆర్టీసీ బస్టాండ్లను నిర్వహిస్తున్నారు. బస్టాండ్లలో కొంచెం స్థలం దొరికితే చాలు దానిని వ్యాపార అవసరాలకు లీజుకు ఇచ్చి డబ్బు ఆర్జించాలన్న ఆలోచన తప్ప.. అది ప్రజోపయోగ స్థలమనీ, దానిని సక్రమంగా నిర్వహించాలన్న ఆలోచన యాజమాన్యానికి ఏమాత్రం లేకుండాపోయింది. బస్టాండ్లలోకి వస్తే ఏదో ఒక అనారోగ్యం సంక్రమించేంత అధ్వానస్థాయిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. కొన్ని బస్టాండ్లలో కనీసం మూత్రశాలలు కూడా లేవు. బస్సు ప్రాంగణాలు శిథిలావస్థకు చేరుకుని ప్రయాణికుల నెత్తిపై పెచ్చులెప్పుడు పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. తాగునీరే కాదు, చేతులు కడుక్కోవడానికి కూడా నీటి వసతి కల్పించడంలేదు. కొళాయిలున్నా అందులో నీరు రావడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.



దిష్టిబొమ్మల్లా మరుగుదొడ్లు

గుంతకల్లు ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన మూత్రశాల, మరుగుదొడ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మూత్రశాలలను సక్రమంగా నిర్వహించని కారణంగా వాటిని ప్రయాణికులు ఉపయోగించడంలేదు. మంచి నీటి ట్యాంకు పనిచేయడం లేదు. బస్టాండు ముందర బురద, నీరు నిల్వ ఉంటోంది. సమస్యలు కనబడతున్నా ఆర్టీసీ అధికారులు బస్టాండులో వసతులు, పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు. బెంగళూరు, తిరుపతి, నెల్లూరు, విజయవాడకు వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకునే కౌంటర్ కొద్ది రోజులుగా మూతపడింది.



గుత్తి బస్టాండులో శిథిలావస్థకు చేరిన పైకప్పు

గుత్తిలో..

ఆర్టీసీ బస్టాండు పైకప్పు శిథిలావస్థకు చేరుకుంది. మరుగుదొడ్ల గదుల పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందోనన్న భయం కలిగిస్తోంది. అయినా.. వాటిని వినియోగించినందుకు ప్రయాణికుల నుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. పురుషుల మూత్రశాల కాలుపెట్టడానికి కూడా వీల్లేనంతగా జుగుప్సాకరంగా ఉంటుంది. అందులో ఒక్క కొళాయి కూడా ఏర్పాటు చేయలేదు. మూత్రశాలలో ఏర్పాటుచేసిన బండలు వదులైపోవడంతో కొన్నింటిని పక్కనపెట్టారు. అందులోని కాలువ సీజ్ అయిపోయి పరిశుభ్రత అనేది లేకుండాపోయింది. ప్రభుత్వం స్వచ్ఛభారత్ కింద నిర్మించిన మూత్రశాలలు మరీ అధ్వానంగా ఉన్నాయి. వీటిని పట్టించుకునే నాథుడేలేడు. తాగునీటి సౌకర్యం సక్రమంగా లేదు. నైట్ సర్వీస్ బస్సులు హైవేలో వెళ్తుండడంతో రాత్రిపూట ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండులో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.



పామిడి బస్టాండులో శిథిలావస్థలో మరుగుదొడ్లు

పామిడిలో..

బస్టాండు శిథిలావస్థకు చేరుకుంది. మరుగుదొడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. బస్టాండు ప్రాంగణం అపరిశుభ్రతకు నిలయమైంది. ప్లాట్ ఫాంలు దెబ్బతిన్నాయి. బస్టాండు కాస్తా.. కారు స్టాండుగా మారిపోయింది. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసమవుతోంది. ఆర్టీసీ స్థలాన్ని కొందరు కబ్జాచేసి షాపులను ఏర్పాటుచేసుకునే యత్నంలో ఉన్నారు. ప్రహరీ నిర్మించి, ఆర్టీసీ బస్టాండును సక్రమంగా నిర్వహిస్తే తప్ప.. ప్రయాణికులు లోపలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఉరవకొండలో..

బస్టాండులో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిపో నుంచి 52 సర్వీసులు నడుస్తున్నాయి. నిత్యం 20 వేల మందిదాకా రాకపోకలు సాగిస్తున్నారు. బస్టాండులో తాగునీటి కొళాయి ఉన్నా, నీటి ట్యాంకును శుభ్రంచేయలేదు. దీంతో నీరు అపరిశుభ్రంగా సరఫరా అవుతోంది. ఆ నీటిని తాగడానికి ప్రయాణికులు ఇష్టపడడంలేదు. బస్టాండు ప్రాంగణంలో తాత్కాలికంగా కుండలను ఏర్పాటు చేసి ప్రయాణికులకు నీటిని అందిస్తున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ కారణంగా మూత్ర విసర్జనకు పక్కనే ఉన్న స్కూటర్ స్టాండుకు ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్తున్నారు. ప్రయాణికులకు అవసరమైన కుర్చీలు కూడా అందుబాటులో లేవు. మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జిల్లేడుబండే..?

(3వ పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.

ముంపు ప్రాంతాలివే...

బుక్కపట్నం, ముదిగుబ్బ మండలాల్లోని ఐదు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూములు మునిగిపోతున్నాయి. రామసాగరం పూర్తిగా మునుగుతుంది. గోపాలపురం గ్రామ సమీపం వరకు మునిగే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. పొడరాళ్లపల్లి, ఛాగాపురం, మంగళమడక, గుంజేపల్లి గ్రామ పొలాలు ముంపు బారిన పడనున్నాయి. రైతులు లక్షలు వెచ్చించి సాగు చేసిన మామిడి, జామ, చీనీ తదితర పండ్ల తోటలను కోల్పోవాల్సి వస్తోంది. దీంతో కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు. ఎకరాకు రూ.25 లక్షలైనా పరిహారం ఇవ్వాలని జిల్లేడుబండ ముంపు రైతులు కోరుతున్నారు.

ఎంత పరిహారమో చెప్పలేదు

జిల్లేడుబండ రిజర్వాయర్ ముంపు బాధితులకు పరిహారం అందజేయడంలో గత వైసీపీ ప్రభుత్వం, అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. జలాశయ నిర్మాణ పనులు చేపట్టాలంటే ముందుగా సేకరించిన భూమికి సంబంధించిన రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. రైతుల అంగీకారం తరువాతే పనులు మొదలు పెట్టాలి. అయితే అప్పటి ధర్మవరం, పుట్టపర్తి వైసీపీ ఎమ్మెల్యేలు రైతులకు జిల్లేడుబండపై గొప్పలు చెప్పారే తప్ప, ముంపు బాధితులకు ఎంత పరిహారం ఇస్తారో చెప్పలేదనే విమర్శలు గట్టిగానే వినిపించాయి.

గ్రామసభలు నిర్వహించకుండానే గత వైసీపీ ప్రభుత్వం నేరుగా రిజర్వాయర్ నిర్మాణం పనులు చేపట్టింది. ఇప్పటికే దాదాపు 40 శాతం పనులు కూడా పూర్తయ్యాయని, రూ.180 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్‌కు మంజూరు కాకపోవడంతో 2023 నవంబరులో పనులు ఆపేశారు. పనులు ఆపివేయడంతో ప్రాజెక్టులో జిల్లేడు మొక్కలు, కంపచెట్లు పెరిగాయి. గత వైసీపీ ప్రభుత్వం జిల్లేడుబండ ప్రాజెక్టు కోసం భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించకుండా మోసం చేసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడైనా పరిహారం అందేనా?

ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు జిల్లేడుబండపై సమావేశం ఏర్పాటు చేసి, అధికారంలోకి రాగానే రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామని ముంపు బాధితలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంకా పరిహారం ఊసెత్తలేదు. గ్రామసభలు నిర్వహించి రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని ముంపు బాధితులు కోరుతున్నారు.

పంటలు సాగు చేయలేకున్నాం



జిల్లేడుబండ రిజర్వాయర్‌కు మాది మూడు ఎకరాల పొలం తీసుకున్నారు. మామిడి తోట, వేరుశనగ, మిరప, బంతిపూలు, ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 240 మామిడి చెట్లు ముంపునకు గురవుతున్నాయి. తోటలో కరకట్ట నిర్మిస్తామని అధికారులు సర్వే చేశారు. పంట సాగు చేస్తే ముంపునకు గురవుతుందేమోనని ఆందోళనతో రెండేళ్లుగా పంటలు సాగు చేయకుండా ఇతర పనులు చేసుకుంటున్నాం.

- హేమేంద్ర, గుంజేపల్లి పొలం రైతు

ప్రతిపాదనలు పంపాం

జిల్లేడుబండ రిజర్వాయర్ ముంపు బాధితుల పరిహారం విషయంలో పైస్థాయి అధికారులకు ప్రతిపాదనలు పంపాం. ముంపు బాధితులకు పరిహారం, కాంట్రాక్టర్‌కు ఇది వరకు చేసిన పనులకు బిల్లులు అందిన వెంటనే మిగిలిన పనులు చేపడతాం.

- వేణుగోపాల్‌రెడ్డి, డీఈఈ, హెచ్ఎన్ఎస్ఎస్ పెనుకొండ

43 పోస్టులకు 1804 దరఖాస్తులు

- **వైద్యవిధాన పరిషత్‌లో పోస్టులకు పోటాపోటీ**
- **మొదలైన పైరవీలు.. రంగంలోకి దళారీలు**

అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యవిధాన పరిషత్ పరిధిలో వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. మొత్తం 43పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరించారు. గడువు ముగియడంతో వచ్చిన దరఖాస్తులను లెక్కించి, స్క్రూట్నీ ప్రక్రియను శుక్రవారం మొదలు పెట్టారు. మొత్తం 1804 దరఖాస్తులు వచ్చినట్లు తేల్చారు. ఇందులో 04ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులకు 293, 03 ఆఫీస్ సబార్డినేటర్ పోస్టులకు 266, 22 జనరల్ డ్యూటీ అటెండెన్స్ పోస్టులకు 832, 02 రికార్డు అసిస్టెంట్ పోస్టులకు 191 దరఖాస్తులు వచ్చాయని డీసీహెచ్ఎస్ డాక్టరు పాల్ రవికుమార్ తెలిపారు. ఈనాలుగు కేటగిరీ పోస్టులకు 1582 దరఖాస్తులు వచ్చాయన్నారు. మిగిలిన బయోమెడికల్ ఇంజనీర్, రేడియోగ్రాఫర్, ఫిజియోథెరపిస్టు, ఆపరేషన్ థియేటర్, పోస్టుమార్టమ్ అసిస్టెంట్, ప్లంబర్ పోస్టులకు అన్నింటికి కలిపి కేవలం 222 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని డీసీహెచ్ఎస్ తెలిపారు. అన్నిపోస్టులకు కలిసి 155 మంది పీహెచ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. పోటీ అధికంగా ఉండటంతో ఆశావహులు పైరవీలు మొదలు పెట్టారు. కొందరు దళారీలు రంగంలోకి డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరికొందరు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు ఇప్పిస్తున్నారని తెలిసింది.



దరఖాస్తులు అందజేస్తున్న అభ్యర్థులు

మెరిట్‌కే ప్రాధాన్యం



దరఖాస్తులు స్వీకరణ ముగియడంతో పరిశీలన చేపడుతున్నాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అనర్హులుగా గుర్తిస్తాం. మిగిలిన వాటిలో మెరిట్‌కే ప్రాధాన్యం ఇచ్చి అభ్యర్థులను ఎంపిక చేస్తాం. ఆ జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి కలెక్టరుకు పంపి అక్కడ ఆమోదం తీసుకుంటాం. ఎవరూ దళారీలను నమ్మి మోసపోకండి. అంతా ప్రతిభకే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ రవికుమార్, డీసీహెచ్ఎస్

కాలిపోతే.. కష్టాలే..!

(3వ పేజీ తరువాయి)

ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుల బారిన పడుతున్నాయి. గత ఐదు నెలల్లో వెయ్యికిపైగా ట్రాన్స్‌ఫార్మర్లు పాడైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,973 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు వచ్చాయి. మే నెలలోనే 8,73 మరమ్మతులకు లోనయ్యాయి. అదేస్థాయిలో మరమ్మతులు పూర్తికాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 10 ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాలున్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు రెండు చొప్పున పూర్తయినా కొంత ఊరటగా ఉంటుంది. రోజుకు పదిహేనుకు మించి కాకపోవడం సమస్యలకు కారణమవుతోంది.

తప్పని కష్టాలు..

ఆశించిన స్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల ప్రక్రియ పూర్తికాపోవడంతో క్షేత్రస్థాయిలో రైతులు, వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. క్షేత్రస్థాయిలోని విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో అవస్థలు తప్పడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటే సంబంధిత అధికారుల తెలియజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అనంతపురం రూరల్ మండల పరిధిలో పదిరోజుల క్రితం ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోతే 48 గంటల్లో మార్పు చేయాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో అయితే 24 గంటల్లో మార్చాలి. అది చాలావరకు అమలు కావడంలేదు. ఎంతలేదన్నా.. మూడు, నాలుగురోజుల సమయం పడుతోంది. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ రీప్లేస్‌మెంట్ కోసం రైతులు, వినియోగదారుల రోజులకొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది.

రోజూ 15దాకా మరమ్మతులు

జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాల్లో రోజూ 15 వరకు మరమ్మతులు పూర్తవుతున్నాయి. ఇటీవల వర్షాలకు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలోనే కొన్ని సమస్యలు వచ్చాయి. వాటిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటాం.

- రవిశంకర్, ఈఈ, ట్రాన్స్‌ఫార్మర్ల విభాగం

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు



ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా 173 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వీటిలో ఇటీవల 40 కేటాయించాం. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైన వెంటనే రైతులు, వినియోగదారులు.. అధికారుల దృష్టికి తీసుకొస్తే.. నిర్దేశిత సమయంలో వాటిని మార్పు చేస్తాం. క్షేత్రస్థాయి సిబ్బందికి తెలపడంలో జాప్యం, ఇతరత్రా కారణాలతో వాటి నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. 1912 టోల్ ఫ్రీ ద్వారా రైతులే సమస్యను తెలియజేసే అవకాశం ఉంది. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

- శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, అనంతపురం జిల్లా

మూసేసుకున్నారు..!

(3వ పేజీ తరువాయి)

కన్నెత్తి చూడటం లేదు. కనీస పర్యవేక్షణ మరిచిపోయారు. ఫలితంగా ఎవరికి వారు హైవేలకు ఆనుకుని ఉన్న తమ స్థలాల వద్ద ఇళ్ల నిర్మాణాలు, ఇతర సముదాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అడ్డుగా ఉంటున్న వంతెనలను కనుమరుగయ్యేలా చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

ఇళ్ల నిర్మాణాలు, భవనాలు, వ్యాపార సముదాయల నిర్మాణ క్రమంలో హైవేల్లో వంతెనలను మూసివేస్తున్నారు. ఇలా మూసి వేయడం వల్ల భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాలతో కలిగే నష్టాలను గుర్తించడం లేదు. కక్కలపల్లి క్రాస్‌లోని వంతెన మూసి వేయడంతో ఇటీవల కురిసిన మోస్తారు వర్షానికి నీరంతా ప్రధాన హైవేపై చేరింది. సర్వీసు రోడ్డుపైకి మురుగునీరంతా వచ్చింది. దీని వల్ల సర్వీసు రోడ్డులో ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలిగింది. హైవేపై వేగంగా వచ్చే వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొన్నిచోట్ల వంతెనల కింద పేరుకుపోయిన చెత్తదారంతోనే నీటి ప్రహానికి ఇబ్బందులు తలెత్తి చుట్టుపక్కల కాలనీలు నీటమునుగుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ చూస్తున్నా..సంబంధిత అధికారులకు కనువిప్పు కలగలేదు.

పర్యవేక్షణ ఏదీ..?

హైవేల నిర్మాణంతోనే తమ పనైపోయినట్లు సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నార్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాటిని కనీసం పర్యవేక్షించడం లేదని వీటిని బట్టి తెలుస్తోంది. అధికారులు పర్యవేక్షణ చేసి ఉంటే మూసివేసిన వంతెనలు కనిపించేవి. వాటిని యథాస్థితికి తీసుకొచ్చే అవకాశం ఉండేది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేలుకుంటే భవిష్యత్తులో జరిగే నష్టాలను అరికట్టేందుకు వీలుంటుంది.



● ఈ చిత్రం అనంతపురంరూరల్ మండలం కక్కలపల్లి క్రాస్‌లోనిది. బెంగళూరు-హైదరాబాదు నేషనల్ హైవే ఏర్పాటు నేపథ్యంలో స్థానికంగా నీటి రాకపోకలకు వంతెన నిర్మించారు. హైవే సర్వీసు రోడ్డుకు ఉన్న ఓ పంక్షన్ హాల్ నిర్వాహకులు ఆ వంతెనను తమ వైపు ఇటీవల పూడ్చేశారు. దీంతో హైవే అటువైపు ఉండే ఇళ్లు, ఇతరత్రా వాటిని నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లేందుకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి వర్షపు నీరు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తెడంతో కొంత కాలువ మాదిరి ఏర్పాటు చేశారు. సహజసిద్ధంగా నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఇలాంటివి చాలా చోట్ల జరుగుతూనే ఉన్నాయి. బహిరంగంగా ఆక్రమణలు కళ్లకు కనిపిస్తున్నా.. అధికారుల్లో మాత్రం చలనం కనిపించలేదు.

అపూర్వ సహోదరులు..!

- **విగ్రహాల తయారీలో రాణిస్తున్న అన్నదమ్ములు**
- **అగళి కళాకారుల నైపుణ్యానికి పలువురి ప్రశంసలు**



పంచలోహాలతో తయారు చేసిన శివుడి విగ్రహాల వద్ద దేవరాజాచారి, విశ్వమూర్తి

అగళి, మే 30(ఆంధ్రజ్యోతి): దేవతా ఉత్సవ విగ్రహాల తయారీలో అందెవేసిన చేయి ఆ సోదరులది. జీవకళ ఉట్టిపడేటట్లుగా విగ్రహాలు తయారు చేయడం వీరి ప్రత్యేకత. శిల్ప, చిత్రకళా రంగాల్లో రాణిస్తూ పదుగురి చేత ప్రశంసలు పొందుతున్న ఆ అన్నదమ్ములే మండల కేంద్రానికి చెందిన దేవరాజాచారి, విశ్వమూర్తిచారి. తండ్రి శ్రీరంగ నుంచి వీరికి ఈ శిల్పకళ వారసత్వంగా అబ్బింది. దీంతో చిన్నప్పటి నుంచే చదువుతో పాటు శిల్పాలు తయారు చేయడాన్ని నేర్చుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు చెందిన ఆలయ కమిటీల ఆర్డర్లపై అనేక ఉత్సవ విగ్రహాలు తయారు చేసి ఇచ్చారు. బంగారం, వెండి, పంచ లోహాలతో ప్రభావళి, బసవన్న, శివుడు, లక్ష్మీదేవి, మారెమ్మ, ఆంజనేయస్వామి, నరసింహస్వామి, తదితర ఉత్సవ విగ్రహాలు అద్భుతంగా తయారు చేసి ప్రశంసలు పొందారు. లేపాక్షిలో కూడా శిల్పాలకు రంగులతోపాటు వివిధ అలంకరణలు చేపట్టారు. వీరి పనితనాన్ని మెచ్చిన బీజేపీ ఎమ్మెల్యే బంగారు లక్ష్మణ్ హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన ఈ అపూర్వ సహోదరులు తమ కళా నైపుణ్యంతో వివిధ ప్రాంతాల్లో పలువురి సత్కారాలు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్ర, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులు

సీతారామచంద్రుడికి అభిషేకం

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా శుక్రవారం సీతారామ చంద్ర ఆంజనేయ స్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. యాగశాలలో ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకాలను నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

ట్రోలింగ్ దుర్మార్గం: రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

గుంతకల్లు టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో సైనికాధికారుల కుటుంబ సభ్యులను సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 'పెహల్గాం ఉగ్రవాదుల దాడి-తదనంతరం పరిణామాలు' అనే అంశంపై శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా సమైక్యతా భావం వెల్లివిరిసిందని అన్నారు. అమెరికా ఆదేశాలతో కాల్పుల విరమణ, తదనంతరం జరిగిన సంఘటనలు మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు. కొన్ని మూకలు సైనికాధికారుల కుటుంబసభ్యులను ట్రోలింగ్ చేయడం సమైక్యతకు సవాలుగా మారిందని అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ మౌనమునిగా మారిపోవడం ఆందోళనకరమని అన్నారు. కేంద్రానికి మద్దతు ఇస్తున్న టీడీపీ, జనసేన ఈ ట్రోలింగ్‌ను ఖండించలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకుడు సురేష్, సీపీఐ నాయకుడు సురేష్, విశ్రాంత ప్రిన్సిపాల్ రామకృష్ణనాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాం క్రస్ట్‌గేట్‌ల తయారీకి నాలుగు కంపెనీల బిడ్

బళ్లారి, మే 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ల తయారీకి ఈ-టెండర్‌లో నాలుగు కంపెనీలు బిడ్ వేశాయి. పనులు చేసేందుకు వీటికి అర్హత ఉందా లేదా అన్న విషయాన్ని జూన్ నాలుగు లేదా ఐదో తేదీన అధికారులు నిర్ధారించనున్నారు. ఇంతకు మునుపు ఈ-టెండర్‌లో బిడ్ వేసిన కంపెనీలో మూడింటికి అనుభవం లేదని, మరో కంపెనీ తన అనుభవాన్ని పొందుపరలేదని తిరస్కరించారు. తాజాగా పిలిచిన రీ టెండర్‌లో నాలుగు కంపెనీలు బిడ్ వేశాయి. డ్యాంకు మొత్తం 33 క్రస్ట్ గేట్లు ఉండగా, 19వ క్రస్ట్‌గేట్ మినహా 32 క్రస్ట్‌గేట్‌ల ఏర్పాటుకు రూ.60 కోట్లతో టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. 19వ క్రస్ట్‌గేటు ఏర్పాటు పనులను గుజరాత్‌కు చెందిన ఓ కంపెనీకి అప్పగించారు. ప్రస్తుతం పశ్చిమ కనుమల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. డ్యాంకు వరద మొదలైంది. ప్రస్తుతం 1000 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ఈ కారణంగా ఈ ఏడాది 19వ గేటు ఏర్పాటు కూడా సాధ్యం కాకపోవచ్చని అధికారులు అంటున్నారు.

ఏసీ బోగీలో అనుమానితుడు

పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు



గుత్తిపోర్ట్ రైల్వేస్టేషన్‌లో జయరాజ్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

గుత్తి, మే 30(ఆంధ్రజ్యోతి): ఏసీ బోగీలో అనుమానాస్పదంగా కనిపించిన నంద్యాల జిల్లాకు చెందిన జయరాజ్ అనే వ్యక్తిని రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇతను రైళ్లలో చోరీకి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన గాలిపోతుల జయరాజ్ అలియాస్ దేవరాజ్.. మచిలీపట్నం నుంచి ధర్మవరంకు వెళ్లే రైలులో ఏ1 ఏసీ బోగిలో అనుమానస్పదంగా కనిపించాడు. దీంతో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది అదుపులోకి తీసుకుని, రైల్వే హెల్ప్ లైన్‌కు సమాచారం అందించారు. రైలు గుత్తి పోర్ట్ రైల్వే స్టేషన్‌కు రాగానే అతన్ని గుత్తి రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్నుంచి ఒక సెల్‌ఫోన్, రెండు తులాల బంగారు తాళిబొట్టు చైన్, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

అదే కావాలి..!

- ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలోనే పోస్టింగ్ కావాలి
- ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో వద్దు
- ధర్మవరం బదిలీ చేసినా ఓడీపై ఇక్కడికే రాక
- సీటు పదిలం కోసం 5 సిఫార్సు లెటర్లు
- హాట్‌సీట్‌గా ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పోస్టు



అనంతపురం న్యూటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ పోస్టు హాట్ సీట్‌గా మారింది. ఈ సీట్లో ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఓ ఉద్యోగి తప్పనిసరి బదిలీల్లో భాగంగా ధర్మవరం వెళ్లాడు. అయితే తన పలుకుబడిని ఉపయోగించి ఓడీపై తిరిగి వచ్చాడు. వేతనం ధర్మవరంలో తీసుకుంటూ ఉద్యోగం అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో నిర్వహిస్తున్నాడు. అనంతపురంలో విధులు నిర్వర్తించాల్సిన వ్యక్తి మాత్రం ఓడీపై ధర్మవరంలో పని చేస్తున్నాడు. ప్రస్తుత బదిలీల్లో అనంతపురం ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో వేతనం తీసుకుంటూ ధర్మవరంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గోపాల్ ఆరోగ్య సమస్యలతో సొంత జిల్లా నంద్యాలకు బదిలీ చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానం ఖాళీ కానుంది. అయితే కళ్యాణదుర్గం నుంచి శ్రీనివాసులు ఇక్కడికి రావడానికి సుముఖంగా ఉన్నట్లు తెలిసింది. ఆమేరకు గురువారం కర్నూలు సర్కిల్ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు కూడా హాజరయ్యారు. అయితే ఇప్పటికే ఇదే స్థానంలోనే ఐదేళ్లు పూర్తి చేసుకొని, మరో రెండేళ్లు ఓడీపై పని చేస్తున్న మరో సీనియర్ అసిస్టెంట్ మాత్రం మరొకరికి అవకాశం లేకుండా తానే ఉండేలా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఏకంగా ఐదుగురు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలను అధికారులకు కౌన్సెలింగ్‌లో సమర్పించినట్లు తెలిసింది. ఆయన ఈ సీటుపై చూపిస్తున్న అతి ఉత్సాహం ఆ కార్యాలయంలోని సిబ్బందికి అనుమానాలు కలగజేస్తోంది.

ఆర్‌అండ్‌బీకి వెళ్లం

ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానం ఖాళీగా ఉంది. అక్కడికి మాత్రం ఎవరు రావడం లేదు. ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ స్థానానికి ఎందుకంత డిమాండన్నది ఆర్అండ్‌బీలోను ఎన్‌హెచ్‌లోను చర్చనీయాంశంగా మారింది. ఏళ్లుగా ఒకే సీటులో పని చేస్తున్న ఆ సీనియర్ అసిస్టెంటును స్థానిక అధికారులు వ్యతిరేకించి మరొకరికి అవకాశం కల్పిస్తారేమోననే అనుమానంతో శుక్రవారం సంబంధిత ఉన్నతాధికారులను ఆయన తనకు న్యాయం చేయాలని విన్నవించుకున్నట్లు కార్యాలయంలో ప్రచారం జరుగుతోంది.

యూనియన్ తరపున పోరాటం

ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఏడున్నర సంవత్సరాలుగా పని చేస్తున్నవారికే మరో సారి స్థానం కల్పిస్తామంటే కుదరదు. కొత్తవారికి అవకాశం లేకుండా సిఫార్సులకే ప్రాధాన్యం ఇస్తే యూనియన్ తరపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని కొందరు ఆ కార్యాలయంలోని యూనియన్ నాయకులు బహిరంగంగానే చెప్పుకొస్తున్నారు. అసలు ఆ సీటులో ఏముంది. ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ స్థానానికి మాత్రం ఎవరు నియమించిన రావడం లేదు. ఎన్‌హెచ్ ఈఈ కార్యాలయంలో ఉన్న సీనియర్ అసిస్టెంట్ స్థానానికి ఎందుకు అంత డిమాండ్ అన్నది అర్థం కావడం లేదు.

సీఐటీయూతోనే కార్మిక వర్గాలకు విముక్తి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

అనంతపురం కల్చరల్, మే 30(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని కార్మిక వర్గాల సమస్యలకు సీఐటీయూతోనే విముక్తి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సీఐటీయూ జెండాలను శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్ వద్ద నాగేంద్రకుమార్ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. 1970లో సీఐటీయూ ఆవిర్భావం నుంచి నేటివరకూ అవిశ్రాంతంగా పోరాటాలు చేస్తోందని, కార్మికవర్గానికి వెన్నుదన్నుగా ఉంటోందని అన్నారు. పదుల సంఖ్యలో కార్మిక చట్టాలు సాధించుకుని, కార్మికులకు రక్షణ కవచంగా సీఐటీయూ నిలిచిందని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా, కార్మికుల కనీస వేతనం కోసం, హక్కుల సాధనకోసం, రక్షణకోసం నిత్యం ఐక్య పోరాటాలు చేస్తోందని అన్నారు. బ్రిటీష్‌వారి హయాం నుంచి 44 రకాల కార్మిక చట్టాలను పోరాడి సాధించుకున్నామని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని, ఇవి కార్మికులకు ఉరితాడుగా మారాయని విమర్శించారు. దేశ భవిష్యత్తుకోసం నాలుగు కార్మిక కోడ్‌ల రద్దు, 29 కార్మిక చట్టాల అమలుకోసం జూలై 9న దేశవాప్తంగా కార్మికుల సార్వత్రిక సమ్మె చేపడుతున్నామని తెలిపారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు, జిల్లా కార్యదర్శి రమాదేవి, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్, సివిల్ సప్లై, జనరల్ హమాలీలు, అంగన్వాడీ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్, మెడికల్ రెప్రజెంటేటివ్ యూనియన్‌ల నాయకులు శ్రీనివాసులు, ఆజాం బాషా, ఆదినారాణ, సురేంద్ర, శ్రీనివాసరావు, కార్మికులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు పరిష్కారం

కలెక్టర్ వినోద్ కుమార్



అనంతపురం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, 22-ఏ భూములను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. 22ఏకు సంబంధించి 16 క్లెయిమ్స్, చుక్కల భూములకు సంబంధించిన 31 దరఖాస్తులపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నిబంధల మేరకు ఉన్నవాటిని ఆమోదించారు. మిగిలినవాటిని పునః సమీక్షకు పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కాలువ కోసం భూములివ్వండి

రైతులకు సీపీఐ నాయకుడు జగదీశ్ వినతి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీశ్

గుంతకల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): రాగులపాడు వద్ద నుంచి చెరువులకు నీరందించే హంద్రీనీవా కాలువ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములను ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, రైతు సంఘాల నాయకులు కోరారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవన్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాగులపాడు నుంచి హంద్రీనీవాలో కాలవను తవ్వితే వజ్రకరూరు, గుంతకల్లు మండలాల్లోని చెరువులకు పుష్కలంగా నీరందుతుందని అన్నారు. ఇందుకోసం 215 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవచ్చిందని అన్నారు. ఈ కాలవ పూర్తి అయితే 12 చెరువులు, 15 చెక్‌డ్యాంలకు నీరు లభిస్తుందని, పరివాహక ప్రాంతంలోని పొలాల్లో వేలాది బోర్లు రిచార్జ్ అవుతాయని అన్నారు. భూసేకరణలో సమ్మతి తెలపాలని రైతులను కోరారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే సత్వరమే కాలవను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారని అన్నారు. ఈ విషయంగా పలు రైతు సంఘాల నాయకులతో కలసి తాము రైతులతో భేటీ అవుతామని అన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము, రామాంజనేయులు, రైతు సంఘాల నాయకులు పులగుట్టపల్లికి చెందిన జయన్న, పామన్న, రామాంజనేయులు, మల్లేనిపల్లికి చెందిన శ్రీనివాసులు, పాత గుంతకల్లు పెన్నయ్య, జి కొట్టాల బాలకృష్ణ, ఎన్ కొట్టాల సయ్యద్ బాషా, దోనిముక్కల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నెట్టెం

అనంతపురం క్లాక్‌టవర్, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా నెట్టెం వెంకటేష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ శుక్రవారం జీఓ నంబరు 366 జారీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్‌గా నెట్టెం వెంకటేష్‌ను సీఎం చంద్రబాబు ప్రకటించి నెల గడిచింది. డీసీఎంఎస్‌కు, ఏడీసీసీబీకి ఏడుగురు చొప్పున సభ్యులు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో తాత్కాలిక పాలకవర్గ సభ్యులను నియమించిన వెంటనే ఏడీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేస్తారు.

తల్లీకొడుకుల అదృశ్యం



అదృశ్యమైన హంసలత, కుమారుడు యశ్వంత్ (ఫైల్)

శెట్టూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కునుకూరుకు చెందిన హంసలత, ఆమె కుమారుడు యశ్వంత్ గురువారం నుంచి కనిపించడం లేదని పోలీసులకు ఆమె భర్త మోహన్ బాబు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులందరూ కూలి పనులకు వెళ్లి ఇంటికి తిరిగొచ్చేసరికి ఇద్దరూ అదృశ్యమయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 9440796818, 9346917104 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ శివ కోరారు.

సచివాలయ ఉద్యోగిపై టీడీపీ నాయకుడి బూతుపురాణం

అనంతపురం క్రైం, మే 30(ఆంధ్రజ్యోతి): నగరపాలిక పరిధిలోని 29వ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ అశ్వర్థరెడ్డిని 30వ డివిజన్ టీడీపీ నాయకుడు రాజేష్ అసభ్య పదజాలంతో దూషించాడు. కడపలో జరిగిన మహానాడుకు జనాలను ఎందుకు తరలించలేదని నిలదీశాడు. తాను అందరికీ ఫోన్ చేశానని అశ్వర్థ రెడ్డి చెబుతున్నా వినిపించుకోకుండా చిందులు వేశాడు. 'సచివాలయం విడిచిపెట్టి పోరా.. సచివాలయంలో ఉండి ఏం పీకుతున్నావ్..? కాళ్లు విరగ్గొడతా..' అని బూతు పురాణం వినిపించాడు. 'అన్నా.. పద్ధతిగా మాట్లాడు.. నేను అందరికీ ఫోన్ చేశా.. కావాలంటే కాల్ లిస్టు చూపిస్తా..' అని అశ్వర్థ రెడ్డి చెబుతున్నా.. రాయలేని భాషలో తిడుతూ రెచ్చిపోయాడు. ఈ ఆడియో సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయింది. టీడీపీ నాయకుడి తీరును సచివాలయ ఉద్యోగులు తప్పుబడుతున్నారు. ఆయనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

బదిలీ సమయంలో ప్రమోషన్‌లా..?

జడ్పీలో నిర్ణయాలపై తీవ్ర విమర్శలు

అనంతపురం విద్య, మే 30(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయంలో జడ్పీ పాలకులకు, అధికారులకు ప్రమోషన్లు గుర్తుకువచ్చాయి. అనుకున్న వెంటనే ఉద్యోగోన్నతులు ఇవ్వడం.. ఖాళీలను కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది. జడ్పీలో శుక్రవారం ఆరుగురికి ఆగమేఘాల మీద ప్రమోషన్లు ఇచ్చారు. జడ్పీ యాజమాన్యం కింద పనిచేసే ఐదుగురు ల్యాబ్ అసిస్టెంట్లు, ఒక రికార్డు అసిస్టెంట్‌కు జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఇన్‌చార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తే ఎవరైనా హర్షిస్తారు. కానీ ప్రభుత్వం బదిలీలపై ఉన్న బ్యాన్ ఎత్తివేసి, ఈ నెల 16 నుంచి జూన్ 2లోపు సాధారణ బదిలీలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఇలాంటి సమయంలో బదిలీల కోసం ఖాళీలు చూపి భర్తీ చేయాల్సిన ఉండగా.. అయిన వారికి ప్రమోషన్లు ఇచ్చి ఆ ఖాళీలను భర్తీ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ క్రమంలో గంట ముందు ఇచ్చిన స్థానాలను మార్చినట్లు సమాచారం. బదిలీల సమయంలో ఉన్న ఖాళీలను ప్రమోషన్ల పేరుతో భర్తీ చేసి, బదిలీల ఖాళీల కోసం ఎదురుచూస్తున్న సీనియర్ ఉద్యోగులకు అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. బదిలీల సమయంలో ప్రమోషన్ల ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదాస్పద నిర్ణయాల ఆలోచన పాలకులదా..? లేక అధికారులదా అని ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం న్యూటౌన్ మే 30(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్ బీ ఉమ్మడి జిల్లా క్లరికల్ సిబ్బంది బదిలీలకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఎస్ఈ రాజగోపాల్ ఆధ్వర్యంలోని కమిటీ బదిలీల ప్రక్రియ చేపడుతుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక ప్రాంతంలో ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్నవారి జాబితాను ఇప్పటికే తయారు చేశారు. మినహాయింపులు ఉన్నవారి నుంచి రిక్వెస్ట్ లెటర్లు తీసుకుని, నిబంధనల ప్రకారం బదిలీలు చేస్తామని ఎస్ఈ తెలిపారు. ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారిలో జూనియర్ అసిస్టెంట్లు ఐదుగురు, ఒక టైపిస్టు, ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, 14 మంది కార్యాలయ సబార్డినేట్స్ ఉన్నారు.

జడ్పీ ఉద్యోగులకు..

అనంతపురం విద్య: ఉమ్మడి జిల్లా జడ్పీ ఉద్యోగులకు శనివారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సర్క్యులర్ జారీ చేశారు. 'ఖాళీలతో కబడ్డీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న జడ్పీ ఉద్యోగులందరూ శనివారం ఉదయం 9.30 గంటలకు జడ్పీకి రావాలని సూచించారు.

61 మంది నాన్ టీచింగ్ ఉద్యోగుల బదిలీ



బదిలీల కౌన్సెలింగ్‌పై మాట్లాడుతున్న డీఈఓలు

అనంతపురం విద్య, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా విద్యాశాఖలో 61 మంది నాన్ టీచింగ్ సిబ్బంది బదిలీ అయ్యారు. రెండు జిల్లాల విద్యాశాధికారుల కార్యాయాలు, ఎస్ఎస్ఏలు, పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులకు శుక్రవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతపురం డీఈఓ ప్రసాద్ బాబు, శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ కిష్టప్ప, ఏడీల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. సీనియర్ అసిస్టెంట్లు 16 మంది, జూనియర్ అసిస్టెంట్లు 22 మంది, రికార్డు అసిస్టెంట్లు 15 మంది, టైపిస్టు ఒకరు, ఆఫీస్ సబార్డినేట్స్ ఏడుగురు బదిలీ అయ్యారు. దీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు రెండు జిల్లాలకు పరస్పరం బదిలీ అయ్యారు.

ప్రత్యేక విద్యపై మూడు రోజుల శిక్షణ

అనంతపురం విద్య, మే 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్పెషల్ బీఈడీ, డీఎడ్ చేసి ఆర్‌సీఐ సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులకు ప్రత్యేక విద్యపై మూడు రోజుల శిక్షణ ఇస్తామని విశ్వభారతి కళానికేతన్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ టీఎస్ రెడ్డి తెలిపారు. తపోవనంలో జీపీఆర్ హాల్‌లో శుక్రవారం జరిగిన శిక్షణకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్పెషల్ బీఈడీ, డీఎడ్ చేసిన వాళ్లు తప్పనిసరిగా నిరంతర పునరావాస విద్య(సీఆర్ఈ) శిక్షణ పొందాలని ఆమె సూచించారు. ఈ కోర్సు చేయడం వల్ల వచ్చే 18 పాయింట్లు ప్రత్యేక విద్య చేసిన వారికి ఉద్యోగాల భర్తీ సమయంలో ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణకు 180 మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు మారెప్ప, వలీబా, పవన్‌కుమార్, సురేష్, మహమ్మద్ అలీ, లోకేష్‌రావు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ. 32వేలు

అనంతపురం రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 32వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 6వేలు, సరాసరి రూ. 20వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 869టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

ఈవీఎం గోదాము తనిఖీ



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో ఉన్న ఈవీఎం గోదామును జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. వివిధ రాజకీయ పార్టీలనాయకులతో కలిసి ఈవీఎం గోదామును పరిశీలించారు. గోదాముకు వేసిన తాళాలను పరిశీలించడంతో పాటు పరిసర ప్రాంతాల్లో తిరిగారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతకాలు చేశారు. పోలీసుభద్రత మరింత పటిష్టంగా ఉండాలని సూచించారు. ఆర్డీఓ, తహసీల్దార్ అప్పుడప్పుడు గోదామును తనిఖీచేయాలన్నారు. జేసీ వెంట ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ నటరాజ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఈడీటీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్..



సిబ్బందితో మాట్లాడుతున్న గోవిందునాయక్

కదిరిఅర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రొబిషన్, ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ గోవిందునాయక్ శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణా తదితర కర్యకలాపాలు కట్టడి చేయాలని సిబ్బందికి సూచించారు. నవోదయం 2.0లో భాగంగా నాటుసారా తయారీదారులపై నమోదైన కేసుల వివరాలను సీఐ రామమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. నాటుసారా తయారీకి సహకరిస్తున్న వ్యక్తులపై పీడీయాక్టు నమోదు చేయాలన్నారు. ఈయేడాది సెప్టెంబర్ 30లోపు స్టేషన్ పరిధిలో అన్నిగ్రామాలు నాటుసారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీశ్‌బాబు



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న హరీశ్‌బాబు

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ బాబు అన్నారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయానికి 38, 39 వార్డుల ప్రజలు వెళ్లి సమస్యలను విన్నవించారు. శుక్రవారం వార్డులో ఆయన పర్యటించారు. డ్రైనేజీ, సీసీరోడ్లు, విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ ధర్మవరం పట్టణ అబివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నారని ప్రజలకు వివరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జూటూరు వెంకటేశ్ పాల్గొన్నారు.

దొంగ పట్టాలను రద్దు చేయాలి



జేసీని కలిసిన సీపీఐ, ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 650-2 సర్వేనెంబరులో జరిగిన అవినీతి అక్రమాలపై విచారించి దొంగపట్టాలను రద్దుచేసి అర్హులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు జాయింట్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు విన్నవించారు. శుక్రవారం జేసీ మార్కెట్‌యార్డ్‌లో భద్రపరచిన ఈవీఎం, వీవీ ప్యాట్‌లను పరిశీలను వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సీపీఐ, ప్లంబర్స్ అసోసియేషన్ నాయకులు అక్కడికి వెళ్లి 650-2లో సమస్యను విన్నవించారు. ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టిరమణ, పూలశెట్టి రవికుమార్, గుర్రం వెంకటస్వామి, గోవిందరాజులు, అన్నం లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, తాజుద్దీన్, మసూద్, రామకృష్ణ, రామసుబ్బయ్య, వేణుగోపాల్, నాగేంద్ర, చిన్నా పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరిఅర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుగుపల్లి పంచాయతీ అబ్బావాండ్లపల్లికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పోతినేని ఉత్తన్న శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గ్రామానికెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు



ఓబుళదేవరచెరువు, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగనలూరు టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడిగా రామిరెడ్డిపల్లికి చెందిన మంకముత్తక ఆంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కన్వీనర్ శెట్టివారి జయచంద్ర తెలిపారు. గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.గోపాల్, కోశాధికారి ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీపతి, ఎం. ఆంజనేయులు, భాస్కర్, కార్యదర్శులు శ్రీరాములు, తిరుపాల్‌నాయక్, మల్లికార్జును ఎన్నుకున్నట్లు చెప్పారు.

కొత్త పాలకవర్గానికి సమస్యల స్వాగతం..!

● వార్డుల్లో పేరుకుపోతున్న చెత్త
● శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య
● అక్రమ నిర్మాణాలు ● నేడు కౌన్సిల్ మీట్



రైల్వేస్టేషన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

కదిరి, మే 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పడిన పాలకవర్గానికి పాత సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వార్డుల్లో పేరుకుపోతున్న చెత్త, శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య, అక్రమ కట్టడాలు, కార్యాలయం వివిధ విభాగాల్లో పేరుకుపోయిన అవినీతి, దశాబ్దాలుగా రోడ్లకు నోచుకోని కాలనీలు తదితర సమస్య ఉన్నాయి. నాలుగు సంవత్సరాల పాటు మున్సిపాలిటీలో అధికారం చెలాయించిన వైసీపీ పాలకులు అభివృద్ధిని అటకెక్కించారు. దీంతో వైసీపీ నుంచి ఎన్నికైన కౌన్సిలర్ సైతం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. ఉన్న ఈ కొద్ది సమయంలోనైనా అభివృద్ధి పనులు చేసి పరువు నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే కొత్తగా ఎన్నికైన పాలకవర్గంపై కౌన్సిలర్లు ఆశలు పెట్టుకున్నారు.

వార్డుల్లో పేరుకుపోయిన చెత్త

గత ప్రభుత్వం ఇంటింటికి చెత్త తీసుకొని పోవడానికి ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసింది. వాటికి డబ్బు చెల్లించకపోవడంతో వాటిని అప్పుగా ఇచ్చిన సంస్థ తీసుకొని వెళ్లిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే చెత్త పన్ను రద్దు చేసింది. ప్రస్తుతం ఉన్న వాహనాలతోనే చెత్తసేకరణ కొనసాగుతోంది. చెత్త బండి రాకపోవడంతో ఇళ్ల యజమానులు వారి ఇళ్లలోని చెత్తను ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో వేస్తున్నారు. దీంతో వార్డుల్లో చెత్త పేరుకు పోతోంది. కొత్త పాలకవర్గం చెత్త సేకరణ, వార్డుల్లో చెత్త కుప్పల తొలగింపుపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య

మున్సిపాలిటీ శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ప్రజలను పట్టిపీడిస్తోంది. ముఖ్యంగా కుటాగుళ్ల, కుమ్మరోళ్ల పల్లి, కందికుంట నారాయణమ్మ కాలనీ, మశానం పేట, జామియా మసీదు, నిజాంవలి కాలనీల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. చిత్రావతి రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరాలో నిత్యం అడ్డంకుల వల్ల సమస్య నెలకొంది. వీటి పరిష్కారానికి గత పాలకులు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. ప్రస్తుతం టీడీపీ పాలక వర్గం తాగునీటి సమస్యలు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేనా?

పట్టణంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట పడేనా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారంలోకి వస్తూనే నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపారు. మున్సిపాలిటీతోపాటు మండలకేంద్రాల్లోనూ అక్రమ లేఅవుట్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. అయితే అక్రమ నిర్మాణాలు మాత్రం కొనసాగతూనే ఉన్నాయి. వలిసాబ్ రోడ్ నుంచి బైపాస్ రోడ్డుకు వెళ్లే దారిలో ప్రభుత్వ స్థలాన్ని ఓ వైసీపీ నాయకుడు కబ్జాచేసి భవన నిర్మాణం చేస్తున్నారు. దీనిపై అధికారులు నోరుమెదపడం లేదు. అలాగే హిందుపురం రోడ్డులో అనేక అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. వీట గురించి పట్టించుకునే తీరిక మున్సిపల్ అధికారులకు లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. వీవర్స్ కాలనీకి సమీపంలో అనుమతి లేకుండా నాలుగు అంతస్తల భవనం నిర్మిస్తున్నారు. దీనికి నూతన పాలకుల దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అవినీతి అంతమయ్యేనా?

మున్సిపల్ కార్యాలయంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన అవినీతి కొత్త పాలకవర్గంలోనైనా అంతమయ్యేనా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటరీ, ఇంజనీరింగ్ సెక్షన్లలో ఎక్కువ శాతం అవినీతికి ఆస్కారమున్నట్లు ప్రజలు చెబుతున్నారు. టౌన్‌ప్లానింగ్‌లో భవనాల అనుమతికోసం ఇతర అనుమతులు తీసుకోవాలంటే పెద్దఎత్తునడబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. శానిటరీ విభాగంలో పారిశుధ్య కార్మికుల నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై కొత్త పాలకవర్గం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పట్టణంలోని మున్సిపల్‌కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి చైర్‌పర్సన్ దిల్‌షాదున్నీసా అధ్యక్షత వహిస్తారని, ఆమెతోపాటు అధికారులు, కౌన్సిల్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాలను రైతులకు వివరించాలి



మాట్లాడుతున్న చిగురుపాటి కుమారస్వామి

కదిరిఅర్బన్, మే30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రైతులకు వివరించాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో శుక్రవారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను రైతులకు వివరించి వారిని కిసాన్ మోర్చాలోకి ఆహ్వానించాలన్నారు. ప్రతి గ్రామంనుంచి కనీసం 20మంది రైతులతో కమిటీ వేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి కష్టమొచ్చినా కిసాన్ మోర్చా అండగా ఉంటుందని భరోసా కల్పించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, శరత్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకాష్‌నాయుడు, చంటి, ఆనంద్‌నాయక్, ఇంతియాజ్, డీఎల్ ఆంజనేయులు, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

ముదిగుబ్బ: ముదిగుబ్బ-పుట్టపర్తి జాతీయ రహదారికి భూములు కోల్పోయిన రైతుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తానని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి హామీ ఇచ్చారు. శుక్రవారం రైతులు ఐదవ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్ రీసెర్చ్ కో-కన్వీనర్ సోమల ప్రకాష్ నాయుడు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భూములు కోల్పోయిన రైతులతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయమైన పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. జోనల్ సెక్రటరీ శరత్‌కుమార్ రెడ్డి, ఉత్తమరెడ్డి, సుదర్శన్, రైతులు హనుమంతు, మునికుమార్, సనత్‌కుమార్, విశ్వనాథ్, నరేష్, రాజేంద్ర, రాజేష్, పాల్గొన్నారు.

అధిక మోతాదులో మాత్రలు మింగి మహిళ మృతి

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): అధిక మోతాదులో మాత్రులు మింగి ఓ మహిళ శుక్రవారం మృతిచెందినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని నాగులబావి వీధికి చెందిన వీణ(48) అనారోగ్యంతో బాధ పడుతుండేది. నిద్రలేమి, తీవ్ర తలనొప్పి బాధ పడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకుంది. అయినా నయం కాలేదు. ఈ క్రమంలో 24న తన భర్త వర్ధంతి రోజు ఆయనను గుర్తు చేసుకుని తీవ్రంగా బాధపడింది. దీంతో తలనొప్పి అధికం కావడంతో గురువారం రాత్రి అధిక మోతాదులో మాత్రలు మింగడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబసభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బత్తలపల్లి మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రాయపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి క్రిష్టరెడ్డి శుక్రవారం చికిత్స పోందుతూ మృతినట్లు ఏఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన మేరకు 5వ తేదీన అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి చెందిన క్రిష్టారెడ్డి, రఘునాథ్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో బత్తలపల్లి నుంచి చియ్యేడుకు వెళుతుండగా యర్రాయపల్లి క్రాస్ వద్ద కారు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. గాయపడిన క్రిష్టారెడ్డి అనంతపురం ఆసుపత్రిలో చికిత్సపోందుతూ మృతి చెందాడు. క్రిష్టారెడ్డికి భార్య నాగలక్ష్మి, కుమార్తె ఉన్నరు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఏఎస్ఐ తెలిపారు.

మహిళ..

బుక్కపట్నం, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదాలంకపల్లికి చెందిన పార్వతి (37) అనే మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు యాదాలంకపల్లికి చెందిన పార్వతి 21వ తేదీన కుటుంబ, వ్యక్తిగత కారణాల వల్ల మనస్థాపంతో పురుగుల మందును తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలికి భర్త భాస్కర్ ఉన్నారు. పార్వతి తల్లి లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీర జవాన్ మురళీనాయక్ స్మారక క్రికెట్ పోటీలు

కదిరిఅర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వీరజవాన్ మురళీనాయక్ స్మారక క్రికెట్ పోటీలు శుక్రవారం పట్టణంలోని డిగ్రీకళాశాల ఆవరణంలో నిర్వహించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. ఉదయం జరిగిన పోటీల్లో కదిరి వారియర్స్ జట్టుపై కదిరిసూపర్‌కింగ్స్ జట్టు విజయం సాధించిందన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన మరో మ్యాచ్‌లో కదిరి లిటిల్‌స్టార్సు జట్టుపై నైట్‌రైడర్స్ జట్టు విజయం సాధించిందన్నారు.

2న ధర్నాను జయప్రదం చేయండి

కదిరి అర్బన్, మే 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో 2వ తేదీన తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆపార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండుసెంట్లు అర్హులైనవారికిఇంటిపట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదన్నారు. అర్హులైనవారికి ఇంటిపట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్న డిమాండ్లలో ధర్నా తలపెట్టామని, జయప్రదం చేయాలని కోరారు. పవన్‌కుమార్, మధునాయక్, లియాకత్, నరసింహులు పాల్గొన్నారు.

చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలి

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చేనేత వృత్తిపై అన్నివర్గాల ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారని, వారికోసం చేనేత క్లస్టర్‌ను ఏర్పాటుచేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు తుంపర్తి పరమేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓహోం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నాయే కానీ చేనేతల సమస్యలను పరిష్కరించేవారు కరువయ్యారన్నారు. గతంలో అందించే పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. ప్రధానంగా చేనేత క్లస్టర్‌ను తక్షణమే ఏర్పాటుచేసి వారిని ఆదుకోవాలన్నారు. ముడిపట్టు సరుకుల రాయితీని అందించాలన్నారు. ముడిపట్టు సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల ముందు మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు జరపాలన్నారు.

పెద్దకోట్లలో పల్లెనిద్ర

తాడిమర్రి, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో గురువారం రాత్రి తాడిమర్రి పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముదిగుబ్బ సీఐశ్యామరావుతో పాటు పోలీసులు పల్లెనిద్రలో పాల్గొని గ్రామస్థులు సూచనలు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. తాడిమర్రి ఎస్ఐ క్రిష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ధర్మవరంరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామంలో ఎంపీడీఓ సాయిమనోహర్ ఉదయాన్నే 6 గంటలకే గ్రామానికి చేరుకుని పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ గ్రామంలో వీధివీధినా పర్యటించి కాలువలను పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలన్నారు. ప్రజలతో మాట్లాడుతూ ప్రధానంగా గ్రామంలో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. డిప్యూటీ ఎంపీడీఓ అశోక్‌నాయక్, కార్యదర్శులు యల్లప్ప, మురళీగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐటీయూ కార్యాలయ సమీపంలో ఆ సంఘం 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘం జెండాను మండల కన్వీనర్ జేవీ రమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అయూబ్‌ఖాన్, ఎల్ఆదినారాయణ, హైదరవలి, మారుతి, చంద్రకళ, పోతక్క, బాబు, చెన్నకేశవులు,ఓలప్ప, రమణమ్మ, బొగ్గు నాగరాజు, శ్రీనివాసులుపాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ 1970 సంవత్సరంలో కార్మికుల హక్కుల కోసం పుట్టిందన్నారు. ఆటో పెద్దన్న, వెంకటేష్, బాబ్జాన్, బాబు, పోతలయ్య, రఫీ, టైలర్ ముత్తు పాల్గొన్నారు.





ధర్మవరం, ముదిగుబ్బలో యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

మహిళా సాధికారతకు మార్గదర్శి

అహల్యాబాయి జీవితం: మాజీ ఎమ్మెల్సీ

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు మార్గదర్శిని అహల్యాబాయి జీవితమని మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు అన్నారు. అహల్యాబాయి హోల్గర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలను బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గాంధీనగర్ చౌడమ్మ ఆలయం నుంచి ఎన్టీఆర్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా కాలేజ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పుణ్యశ్లోక అహల్యబాయి హోల్గర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. బీజేపీ మాజీ కార్యవర్గసభ్యులు ఉత్తమ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బూదిలి సుదర్శన్, అనంతపురం మాజీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, ఆదినారాయణయాదవ్, జింకాచంద్ర, గొట్లూరు చంద్ర, సాకే ఓబుళేశు పాల్గొన్నారు.

పబ్లిక్ పార్క్ అన్యాక్రాంతం కాకుండా చూడండి



మున్సిపల్ కమిషనర్‌కు విన్నవిస్తున్న ప్లాట్ల యజమానులు

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి):ప ట్టణంలోని రేగాటిపల్లికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న పబ్లిక్ పార్క్ అన్యాక్రాంతం కాకుండా చూడాలని అక్కడున్న ప్లాట్ల యజమానులు వీరనారాయణ, రాయపాటిశివ మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు విన్నవించారు. ఈ మేరకు వారు కమిషనర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. సర్వేనెంబరు 551-1సీలో 9.09 ఎకరాలు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ హైదరాబాద్ వారి ఉత్తర్వులు మేరకు ఆమోదించిన లేఅవుట్‌లో ప్రైవేటుగా సేల్ డీడ్ మేరకు 110 ప్లాట్లను కొనుగోలు చేసి అందులో ప్రతి ప్లాటుకు మున్సిపల్ అధికారుల నుంచి ప్లాన్ అప్రూవల్‌చేయించుకుని స్థిర నివాసాలు ఏర్పాటుచేసుకున్నామన్నారు. ఆ లేఔట్‌లో 0.91 సెంట్ల స్థలాన్ని పబ్లిక్ పార్కుకోసం వదిలామన్నారు. ఆ భూమిని కొందరు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు చేపడుతున్నారని, వీటిపై విచారించి పబ్లిక్ పార్క్ అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీకి ఎమ్మెల్యే రూ.10 లక్షల విరాళం

పుట్టపర్తిరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా కడపలో నిర్వహించిన మహానాడులో ఎమ్మెల్యే పల్లె సిందూరరెడ్డి పార్టీకి రూ.10లక్షల విరాళం అందచేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇందుకు సంబంధించిన చెక్‌ను కడపలో జరిగిన మహానాడు వేదికగా జాతీయ అధ్యక్షుడు సీఎం చంద్రబాబుకు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలసి అందచేసినట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన: ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తచెరువు మండలం ఇరగంపల్లి, నాగిరెడ్డిపల్లి, బుక్కపట్నం మండల కేంద్రం కోటవీధిలో, బుచ్చయ్యగారిపల్లిలో, జానకం పల్లి, పుట్టపర్తి మునిసిపాలిటీ కర్ణాటకనాగేపల్లి, ఎనుమలపల్లిలో పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

బలిజ కల్యాణమండప నూతన కమిటీ ఎంపిక

ధర్మవరం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గా పెద్దపెద్దన్న రోషన్న బలిజ కల్యాణమండప నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. నూతన అధ్యక్షుడిగా జరీ సుబ్రహ్మణ్యం, సభ్యులుగా యంబా లింగన్న, ఏరే శ్రీనివాసులు, గాండ్ల మహేశ్, శాగా సురేశ్, అంబారపు శ్రీనివాసులు, సోలిగాళ్ల చిన్నవెంకటేశులు, సంకు పవన్‌కుమార్, కొండమీదరాయుడులను ఎన్నుకున్నారు. వీరిని దండు చలపతి, సత్రశాల అశ్వర్థ, పాగాల అశ్వర్థనారాయణ, రుద్రారవి, పుట్లూరు నరసింహులు, రవి శాలువాలతో సత్కరించారు. అనంతరం బలిజకల్యాణ మండప అభివృద్ధికి కృషిచేస్తామని సభ్యులు పేర్కొన్నారు.

పెద్దకోట్లలో పల్లెనిద్ర

తాడిమర్రి, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో గురువారం రాత్రి తాడిమర్రి పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముదిగుబ్బ సీఐశ్యామరావుతో పాటు పోలీసులు పల్లెనిద్రలో పాల్గొని గ్రామస్థులు సూచనలు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంత జీవనం గడపాలన్నారు. తాడిమర్రి ఎస్ఐ క్రిష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రానికి చేరిన విత్తన కాయలు

తనకల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బాలసముద్రం పంచాయతీ రైతు సేవాకేంద్రానికి శుక్రవారం వంద క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు చేరాయి. విత్తన కాయల నాణ్యతను వ్యవసాయాధికారులు, రైతులు పరిశీలించారు. మండలానికి ప్రభుత్వం 3,157 క్వింటాళ్ల విత్తన వేరుశనగను మంజూరు చేసినట్లు ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. రెండురోజులలోపు అన్ని రైతు సేవా కేంద్రాలకు విత్తనకాయలు రానున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే విత్తనకాయలు పంపిణీ చేస్తామన్నారు.

చిన్నపాటి వర్షానికే కారుతున్న ప్రభుత్వ ఆస్పత్రి



ఆస్పత్రి పైకప్పు నుంచి కారుతున్న నీరు

నల్లచెరువు (కదిరి), మే 30 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈవర్షానికి ప్రభుత్వ ఆసుప్రతిభవనం పైకప్పునుంచి నీరు కారాయి. నీరు కారుతుండడంతో రోగులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రిలో పాలిష్ బండలు వేసి ఉండడంతో వర్షపు నీరు పడి జారే ప్రమాదం ఉందని రోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పాలనలో నాసిరకంగా పనులు చేయడంతోనే మోస్తరు వర్షానికే కారుతోందని రోగులు చెబుతున్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించాలని రోగులు కోరుతున్నారు.

బాలయ్యకు అవార్డు.. సంబరాలు



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కేక్‌కట్‌చేస్తున్న నాయకులు

హిందూపురం, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు ప్రకటించడంతో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ సినీ పురస్కారాల్లో భాగంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఎన్టీఆర్ నేషనల్ ఫిలిమ్ అవార్డు ప్రకటించారు. దీంతో హిందూపురంలో టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కార్యాలయంవద్ద కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించడం, తాజాగా ఎన్టీఆర్ జాతీయ అవార్డు ప్రకటించడం ఎంతో ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ వీరయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డి, నంబూరి సతీష్, నాయకులు, ప్రెస్‌వెంకటేశ్, చంద్ర, గంగాధర్, బాచి, అమర్నాథ్, భార్గవ్, చంద్ర, రాము, వీవర్స్ కాలనీ ఆంజనేయులు, శంకర్, ఆనంద్, డైమండ్‌బాబా, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోపు మట్టిరోడ్డు లేకుండా చేస్తాం

- మున్సిపల్ చైర్మన్ రమేష్



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు

హిందూపురం, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడాదిలోపు మట్టి రోడ్డు కనబడకుండా మొత్తం సీసీ రోడ్లు వేయిస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీకంఠపురం వద్ద కొత్త ప్రొటెక్షన్‌వాల్, సీసీరోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.40లక్షలతో ప్రొటెక్షన్‌వాల్, సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, కౌన్సిలర్లు గిరీష్‌కుమార్, మంజుళ, అంజలీ, నాయకులు ప్రెస్‌వెంకటేశ్, తిమ్మయ్య, కదిరప్ప, నవీన్, టైలర్ గంగాధర్, బీజేపీ నాయకులు ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మతులు: జడ్పీటీసీ



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ

అగళి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జడ్పీటీసీ ఉమేష్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయానికి పెయింటింగ్, సమావేశ భవనానికి మరమ్మతులు, కాంపౌండ్‌వాల్, కుర్చీలు, డోర్లు, విద్యుత్ తదితర వాటికి ఎస్టిమేట్‌లు తయారుచేయాలని మండల ఇంజనీర్ రామాంజినేయులుకు సూచించారు. జడ్పీ నిధులకింద రూ.34లక్షలు నిధులు మంజూరయ్యాయని నరసంబుది, అగళి, మధుడి, కోడిపల్లి, బీబ్యాడిగెర, ఇనగలూరు, రావుడి, గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ మంజునాథ్, స్థానిక నాయకులు, జయన్న, రంగప్ప, రఘు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు భూముల పరిశీలన

అగళి, మే 30(ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు అగళి మండలంలోని భూ ములను శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సుబ్బారావు, ఆర్‌ఐ చంద్రశేఖర్‌రావు, మండలంలోని పంచాయతీలలో అందుబాటులో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. బ్యాడిగెర పంచాయతీలో 66ఎకరాలు, హెచ్‌డిహళ్లి 2వేల ఎకరాలు, ఇనగలూరు వెయ్యి ఎకరాలు, రావుడి పంచాయితీలో 1500ఎకరాలను పరిశీలించారు. ఇందులో ప్రభుత్వ భూములకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుతెలిపారు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే రైతుల నుంచి భూములను సేకరిస్తామని తెలిపారు. వీఆర్ ఓలు ప్రకాశ్, కార్తీక్, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

గుడిబండ, మే 30(ఆంధ్రజ్యోతి): గుడిబండ మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను అడ్మిషన్లు శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. మే 4న ఆదివారం జరిగిన ఎంట్రెన్స్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థినులకు కళాశాలలో ప్రవేశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థినులకు క్యాటగిరి ప్రకారంగా సీట్లను కేటాయించామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు శివలింగప్ప, అర్చన, శీను, రాధ ఉన్నారు.

అనాథాశ్రమ నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం

గోరంట్ల, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మయ్యగారిపల్లి శ్రీమారెమ్మ ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న అనాథ శరణాలయం కోసం రామమోహన్‌రెడ్డి రూ.5,00,116ల విరాళం శుక్రవారం అందించారు. గోరంట్లకు చెందిన విద్యుత్‌శాఖ మాజీ ఉద్యోగి రామమోహన్‌రెడ్డి, నాగమల్లేశ్వరీ, కుమారుడు నవీన్‌రెడ్డి ఆలయానికి వెళ్లి ట్రస్టు చైర్మన్ దేవరాజు స్వామికి నగదు విరాళం అందించారు.

ఆంజనేయ విగ్రహానికి రూ.2లక్షలు

హిందూపురం, మే 30(ఆంధ్రజ్యోతి): సూగూరు ఆంజనేయస్వామి 40 అడుగుల ఏకశిల విగ్రహానికి వాల్మీకి సంఘం గౌరవాధ్యక్షులు ఆదినారాయణప్ప రూ.2లక్షలు విరాళాన్ని విగ్రహ ట్రస్ట్ చైర్మన్ వైసీ చంద్రశేఖర్‌కు అందజేశారు. శుక్రవారం దాత ఆదినారాయణప్ప చెక్కును చంద్రశేఖర్, రాయల్‌గోపాల్‌కు అందజేశారు.

మంజూరైన నిధులు సభ్యులకే కేటాయించాలి

ఎంపీడీఓను డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల, మే 30(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయానికి మంజూరైన నిధులను కార్యవర్గ సభ్యులైన ఎంపీటీసీలకే కేటాయించాలని తద్వారా అభివృద్ధి జరిగేలా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఎంపీడీఓ నరేంద్రకుమార్‌ను డిమాండ్ చేశారు. శుక్రవారం వైసీపీ నాయకులు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి ఆమె గోరంట్ల మండలపరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీఓతో చర్చించారు. ప్రజల చేత ఎన్నికైన సభ్యుల ద్వారా అభివృద్ధి పనులు జరిగేలా చూపకపోవడం, వారిని అవమాన పరచడమేనన్నారు. సభ్యులను ఎప్పుడు తక్కువ చేసి చూడలేదని మంత్రి ఆదేశాలను అమలు చేయాల్సి ఉందని ఎంపీడీఓ ఆమెకు వివరించారు.

లాభదాయకం.. పండ్లతోటల పెంపకం

ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ప్రయోజనాలు

13 రకాల మెయింటెనెన్స్ చార్జీల చెల్లింపు



పండ్లతోటలను పరిశీలిస్తున్న ఏపీఓ

సోమందేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల పెంపకం రైతులకు లాభదాయకంగా కనిపిస్తోంది. వరుస కరువు కాటకాలతో సంప్రదాయ పంటలతో నష్టపోతున్న రైతన్న ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పండ్లతోటల పెంపకానికి ముందుకొస్తే సుస్థిర ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. సన్న, చిన్నకారు రైతులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా రైతులను బలోపేతం చేసేందుకు కృషిచేస్తోంది. పథకం ద్వారా ఎలాంటి ప్రయోజనాలు లభిస్తాయో అధికారులు, గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకం ద్వారా 17 రకాలు మామిడి, చింత, కొబ్బరి, నేరేడు, రోజ, మల్లి, జామ, సపోట తదితర రకాలకు చెందిన మొక్కలను అందిస్తున్నారు. అదేవిధంగా 13 రకాల మెయింటెనెన్స్ చార్జీలను చెల్లిస్తుంది. మొక్కలు నాటేందుకు దుక్కులు, కలుపు, పాదులు, ఎరువులు, వాచ్‌అండ్‌వార్డ్, నీటి బిల్లులను మూడేళ్లదాకా అందిస్తారని అధికారులు చెబుతున్నారు. ఆసక్తికలిగినవారు అంతర్‌పంటలను కూడా సాగుచేసుకోవచ్చు. దీంతో బీడుభూములు సాగుభూములుగా మారి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అంటున్నారు. ఈ పథకాలు కరువు ప్రాంత రైతులకు వరంగా చెప్పవచ్చు. పంటలు బీడుగా వదిలేయడంకంటే ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటలు పెంపకం చేపట్టడం ద్వారా ఐదేళ్ల తరువాత జీవితాంతం ఆదాయాన్ని గడించవచ్చు. మండలంలో 180 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 86 ఎకరాల్లో అధికారులు పండ్లతోటల పెంపకాన్ని రైతులతో చేపడుతున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పండ్లతోటల పెంపకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తికలిగిన రైతులు మండల కార్యాలయానికి వచ్చి అధికారులను సంప్రదించాలన్నారు.

వర్షం రాకతో తీరిన పశుగ్రాస సమస్య

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



గ్రాసాన్ని తింటున్న పశువులు

చిలమత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): వరుణ దేవుడు కరుణించాడు. వర్షాకాలం ప్రారంభానికి ఇంకా 20 రోజులు ఉండగానే ముందస్తుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో జనజీవనం ఊపిరిపీల్చుకుంది. ప్రధానంగా మూగజీవాలకు ప్రాణం పోసినట్లైంది తీవ్ర పశుగ్రాస సమస్యతో బాధపడుతున్న వాటికి కురుస్తున్న వర్షాలతో పచ్చిక బయళ్లు చిగురిస్తున్నాయి. తద్వారా వాటి మేత సమస్య తీరినట్లేనని చెప్పాలి. ఈ ఏడాది మార్చి నుంచి తీవ్ర ఎండల కారణంగా మూగజీవాలకు మేత కరువైంది. చాలా చోట్ల గ్రాసం సరిగా అందక పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయాయి. ఇక మేకలు, గొర్రెల సంగతి చెప్పనక్కర్లేదు. వాటిని మేత కోసం బయళ్లకు తీసుకెళ్లినా పిడికెడు మేత దొరకడం గగనమైపోయింది. దానికి తోడు పచ్చిక బయళ్లకు వేసవిలో కొందరు నిప్పు పెట్టడంతో ఉన్న మేత కూడా అగ్నికి ఆహుతైంది. ఈ తరుణంలో మే మొదటి వారం నుంచే వరుణ దేవుడు కరుణించాడు. అప్పటి నుంచి అడపాదడపా ఓ మోస్తరు భారీ వర్షాలు నమోదవుతున్నాయి. సాధారణంగా రుతుపవనాల గమనం ప్రతి ఏటా ఆలస్యయ్యేది. కానీ ఈ ఏడాది ముందస్తుగా రాష్ట్రాన్ని తాకడంతో వాటి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా బీడు భూములు పచ్చదనాన్ని పరుచుకుంటున్నాయి. ఇన్నాళ్లు పశుగ్రాస సమస్యతో బాధపడుతున్న పాడి పశువులకు, మేకలు, గొర్రెలకు అవసరమైనంత మేత దొరుకుతోంది. దీంతో పాడి రైతులు, గొర్రెల కాపర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల ముందు ట్రాక్టర్ మేత కోసం రూ. 10 వేల వరకు వెచ్చించి మేతను కొనుగోలు చేశామని, ఇప్పుడు ముందస్తుగా వర్షాలు కువడరతో పశువులకు కడుపునిండా మేత దొరుకుతోందని అంటున్నారు. పశువుల మేత సమస్య తీరడంతో పాటు ముంగారు సేద్యానికి అనుకూలమైందని, సకాలంలో విత్తనాలు వేసుకుంటామని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ రంగస్వామి



మడకశిర వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

మడకశిర రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యమని యోగా గురువు శ్రీనివాసులు, మున్సిపాల్ కమిషనర్ రంగస్వామి అన్నారు. శుక్రవారం వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో యోగాపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతోందన్నారు. అనంతరం యోగా అవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి: ఎంపీడీఓ

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): యోగాను జీవితంలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ వెంకటలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో యోగా ట్రైనర్ ద్వారా ఆసనాలు వేయించారు. ధ్యానం, యోగాసనాలు, ప్రాణాయామం ప్రతిరోజూ సాధన చేయడంద్వారా మానసిక స్వస్థత, శారీరక ఆరోగ్యం చేకూరుతుందన్నారు.

పరిగి, (ఆంధ్రజ్యోతి): సేవామందిరం హైస్కూల్‌లో శుక్రవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రెడ్డప్ప ఆధ్వర్యంలో అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ హైస్కూల్ నుంచి సేవామందిరం మధుగిరి కూడలి వరకు సాగింది. ర్యాలీలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, ప్రవీణ్‌రెడ్డి, మహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బీకే దంపతులు

పెనుకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామంలో గాయత్రిదేవి నూతన ఆలయ నిర్మాణానికి ఎంపీ బీకే పార్థసారధి, కమలమ్మ దంపతులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎంపీ నిధుల ద్వారా మంజూరైన రూ.10లక్షలతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పరిగి, (ఆంధ్రజ్యోతి): బీరలింగేశ్వర ఆలయ నిర్మాణానికి ఎంపీ బీకే పార్థసారధి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం శాసనకోటర హదారిలోని వాల్మీకి కల్యాణమండపం నిర్మాణ పనులు పరిశీలించారు. త్వరగా నిర్మాణం చేపడితే బిల్లులు మంజూరయ్యేందుకు తన వంతు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ మూర్తి, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, శీగుపల్లి నాగప్ప, హనుమయ్య, జేసీబీ ఆనంద్, శేఖర్ పాల్గొన్నారు.

సచివాలయ కిటికీ అద్దాలు ధ్వంసం

హిందూపురం(రొద్దం), మే 30(ఆంధ్రజ్యోతి): రొద్దం సచివాలయం-3 కిటికీ అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వసం చేశారు. గురువారం రాత్రి సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం సచివాలయం సిబ్బంది కార్యాలయానికి రాగా కిటికీ అద్దాలు ధ్వంసం కావడంతో ఎంపీడీఓ రామ్‌కుమార్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎంపీడీఓ పరిశీలించి పోలీసులకు పిర్యాదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

పెనుకొండ రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని గోనిపేట బ్రిడ్జి సమీపంలో శుక్రవారం 44వ జాతీయరహదారిపై టైర్ బరస్ట్ అయి లారీ బోల్తాపడిన సంఘటనలో డ్రైవర్ శ్రీనివాసులు గాయపడినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తమిళనాడు నుంచి డ్రైవర్ శ్రీనివాసులు లారీలో యూరియా లోడ్ తీసుకుని అనంతపురం వైపు వెళ్తున్నాడు. గోనిపేట బ్రిడ్జివద్దకు రాగానే టైర్ బరస్ట్ అయి వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

'విగ్రహాలు ఏర్పాటు చేయండి'

మడకశిర టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజావాణా కూడలిలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని లోకకల్యాణ్ ప్రజాసమితి నాయకులు శుక్రవారం నగరపంచాయితీ ఏఈ మురళికి వినతిపత్రం అందజేశారు. అలాంటి విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల భావితరాలకు స్ఫూర్తిగా ఉంటుందన్నారు. నాయకులు సుబ్బరాయుడు, విరుపాక్షప్ప, నారాయణప్ప, నరసింహప్ప తదితరులు ఏఈని కలిసిన వారిలో ఉన్నారు.

'మొక్కలను సంరక్షించాలి'

పెనుకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): మొక్కలను సంరక్షించాలని జలవనసంరక్షణ సమితి నాయకులు సూచించారు. స్థానిక బోగసముద్రం చెరువు జలవనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ ప్రాంగణం చుట్టూ రహదారిపక్కన మొక్కలు నాటి నీళ్లపోశారు.

కాశీవిశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెనుకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవా రం అర్చకులు రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వడిసలమ్మకు..



వడిసలమ్మకు ప్రత్యేక అలంకరణ

మడకశిర టౌన్, మే30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం వడిసలమ్మను ప్రత్యేకంగా ఆకు పూజ అలంకరణ చేశారు. శుక్రవారం సందర్భంగా పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తుమ్మల మారెమ్మకు...



తుమ్మల మారెమ్మ

గుడిబండ, మే 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

బురద రోడ్డుపై వరినాట్లువేసి నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

రొళ్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): బురద రోడ్డుపై వరినాట్లు వేసి మహిళలు నిరసన వ్యక్తం చేశారు. మల్లినమడుగు ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చకపోవడంతో మహిళలు, గ్రామస్థులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షం పడిన సందర్భంలో రోడ్డులో నీరు నిలిచి నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం



డీఎల్ రోడ్డులో కాలువలపై ఉన్న అక్రమ నిర్మాణాలు

సోమందేపల్లి, మే 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని డీఎల్‌రోడ్డు కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమేకాక తరచూ ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఆక్రమణల తొలగింపుకు ఎట్టకేలకు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కాలువపై నిర్మాణాలు గొడవలకు ఆజ్యం పోస్తున్న వైనం అన్న కథనం ప్రచురితమైంది. దీనికి ఎంపీడీఓ వెంకటలక్ష్మీ స్పందించారు. ఈ ఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, పంచాయతీ అధికారులను ఆదేశాలు జారీచేశారు. డీఎల్‌రోడ్డులో కాలువపై నిర్మాణాలు చేపట్టిన గృహ యజమానులకు నోటీసులు జారీచేయాలని ఆమె సూచించారు. మూడు నోటీసులను అందజేయాలన్నారు. స్పందించకుంటే 24గంటలు సమయం ఇచ్చి ఎక్సకవేటర్ సాయంతో తామే అక్రమ నిర్మాణాలను తొలగిస్తామన్నారు. ప్రజలు తమను సహకరించి ఎవరికి వారే కాలువలపై నిర్మించుకున్న ప్రమారీలు, మెటుకులు, అరుగులు, మరుగుదొడ్లు ఇతరాత్ర కట్టడాలు తొలగించుకోవాలని తెలిపారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టడమేకాక ఒకరిపై ఒకరు గొడవలకు దాడికి దిగడం సరికాదన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించి మూడు రోజుల్లోగా చర్యలకు ఉపక్రమిస్తామన్నారు. నిబంధనల మేరకు నడుచుకుంటామని పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పరిగి, మే 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం మధుగిరి నుంచి మద్యం తీసుకుని సేవామందిరానికి వస్తున్న నాగప్ప, హనుమంతు, పల్లవిలను ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 108 విస్కీ టెట్రా ప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పృథ్వి, ఫారూక్, నారాయణస్వామి, హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, వెంకటేశ్, రమణ, సతీష్, కానిస్టేబుళ్లు అంజి, సురేంద్ర, రవీంద్ర, కుమార్, రంగదామ, సుధాకర్‌రెడ్డి, ఉస్మాన్, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తే పీడీ యాక్ట్: ఎక్సైజ్ సీఐ

హిందూపురం, మే 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకొచ్చి ఇక్కడ విక్రయించాలని చూస్తే అలవాంటివారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య హెచ్చరించారు. శుక్రవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌వద్ద కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి పట్టుబడిన పాత నేరస్తులను బైండోవర్‌చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. 16 మంది పాత నేరస్థులను బైండోవర్‌చేసి ఒక్కొక్కరికి రూ.లక్ష పూచికత్తుతో విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఫారూక్, పృథ్వి, నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి పింఛన్ల పంపిణీకి మంత్రి రాక

హిందూపురం(రొద్దం), మే 30(ఆంధ్రజ్యోతి): నారనాగేపల్లి గ్రామంలో పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత రానున్నారని కన్వీనర్ నరహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు నారనాగేపల్లి గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీని ప్రభుత్వం చేపట్టిందన్నారు.

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 పంచాయతీల పరిధిలో పింఛన్ల పంపిణీని శనివారం చేపడుతున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని 11,240మంది లబ్ధిదారులకు రూ.4,85,50,000 మంజూరైందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాల సిబ్బంది ద్వారా ఉదయం నుంచి పంపిణీ చేపడతారన్నారు.

డీఎస్సీ మెటీరియల్ పంపిణీ

గోరంట్ల, మే 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలతో రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ ద్వారా 15 మందికి ఉచితంగా డీఎస్సీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఉర్దూ టీచర్స్ రాష్ట్ర అసోసియేషన్ అడిషనల్ జనరల్ సెకటరీ ఫైరోజ్ అహమ్మద్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం ప్రధాన కార్యదర్శి గౌస్‌బాషా, ఉపాధ్యాయులు ఇదయతుల్లా పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం

చిలమత్తూరు, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు గ్రామంలో రెండు పురాతన ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి యత్నించి విఫలమయ్యారు. గ్రామంలోని చంద్రమౌళీశ్వరాలయం, చెన్నకేశవ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. చంద్రమౌళీశ్వరాలయంలోకి ఉన్న హుండి, చౌడేశ్వరీ దేవి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించి ప్రధాన తలుపు వద్ద వదిలేసి వెళ్లారు. అదేవిధంగా చెన్నకేశవ ఆలయంలో హుండీ కోసం ప్రయత్నించి కుదరకపోవడంతో దానినీ అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. ఉదయం గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

అదృశ్యమైన యువతి ప్రత్యక్షం

పెనుకొండ రూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని పూజిత శుక్రవారం కియా పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమైంది. ఈనెల 19న పూజిత కళాశాలకు వెళ్లి తిరిగి రాలేదని 22న తల్లి కాంతమ్మ కియా స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు వెంకటగిరిపాళ్యంకు చెందిన కురుబసాయి, పూజిత కలిసి తమిళనాడులోని తిరువన్నమలైలో వివాహం చేసుకుని శుక్రవారం కియా స్టేషన్‌లో హాజరైనట్లు తెలిపారు. పూజిత మేజర్ కావడంతో కురుబసాయి ఇంటికి పంపించినట్లు ఏఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.